# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :209 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: బుధవారం 23-10-2024 పేజీలు:4 వెల: 2.00


## జేఎంఎం పార్టీలో చేరిన బీజేపీ ఎమ్మెల్యేలు, నేతలు

రాంచీ: జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరు అందుకున్నది. ఈ నేపథ్యంలో అనేక మంది బీజేపీ నేతలు.. జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీలో చేరారు. దీంట్లో ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యేలు లూయిస్ మారండి, కునాల్ సారంగి, లక్ష్మణ్ తండు ఉన్నారు. మూడు సార్లు బీజేపీ టికెట్‌పై గెలిచిన కేదార్ హజ్రా కూడా ఇటీవల జేఎంఎం పార్టీలో చేరారు. బీజేపీ నుంచి 2014లో లూయిస్ మరాండి.. 5వేల ఓట్ల తేడాతో దుమ్కాలో సీఎం హేమంత్ సోరెన్‌పై విజయం సాధించారు. ఇప్పుడు లూయిస్ మరాండి జేఎంఎంలో చేరారు. మాజీ బీజేపీ నేతలకు వెల్కమ్ చెబుతూ సీఎం హేమంత్ సోరెన్ తన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. అయితే దుమ్కా స్థానం నుంచి 2019లో హేమంత్ సోరెన్ 13వేల ఓట్ల తేడాతో లూయిస్ మరాండిపై గెలుపొందారు. అదే స్థానంలో జరిగిన బైపోల్స్‌లో బసంత్ సోరెన్ చేతిలో లూయిస్ ఓడిపోయారు.

## పీసీసీ చీఫ్‌పై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్,తన ప్రధాన అనుచరుడు గంగారెడ్డిని కోల్పోవడంతో కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతోనే తనకు తమ్ముడిలాంటి వాడిని కోల్పోయాననే ఆవేదనలో ఉన్నారని ఆయన్ను చూస్తేనే అర్థమవుతుంది. ఆ బాధతోనే ' మీకు.. మీ పార్టీకి ఓ దండం.. మమ్మల్ని ఇలా బతకనివ్వండి' అంటూ కాంగ్రెస్‌పై అసహనం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి.అడ్లూరి లక్ష్మణ్‌తో జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వైరల్ కావడంతో ఆయనకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఫోన్ చేశారు. గంగారెడ్డి మరణం నేపథ్యంలో జీవన్ రెడ్డిని పరామర్శించారు. అలాగే కాంగ్రెస్ పార్టీపై జీవన్ రెడ్డి అసహనంగా ఉండటంతో ఆయన్ను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ జీవన్ రెడ్డి వినిపించుకోలేదు. కాంగ్రెస్ పార్టీలో ఎందుకు కొనసాగాలని మహేశ్‌కుమార్‌ను ఎదురు ప్రశ్నించారు. చంపించుకోవడానికే పార్టీలో ఉన్నామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఏమీ మాట్లాడకుండా ఫోన్‌ను పక్కన పడేశారు.కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రధాన అనుచరుడు, జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి హత్య జగిత్యాల జిల్లాలో సంచలనం రేపింది. తన ప్రధాన అనుచరుడి హత్య గురించి తెలియగానే ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హుటాహుటిన జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. గంగారెడ్డి హత్యను నిరసిస్తూ ఆస్పత్రి ఎదుట ఆయన ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ నాయకుల్నే ఇంత దారుణంగా హత్య చేసిన తర్వాత అసలు రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా? లేవా? అని ప్రశ్నించారు. తన అనుచరుడిని హత్య చేయడం అంటే తనను కూడా హత్య చేసినట్లే అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. క్రియాశీలకంగా పార్టీలో పనిచేస్తే చంపేస్తారా అని ప్రశ్నించారు. గంగారెడ్డిని చంపిన వారిని పట్టుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు.' మాకు నలుగురికి సేవ చేయడమే తెలుసు.. ఏదైనా స్వచ్ఛంద సంస్థ పెట్టుకుని అయినా ప్రజలకు సేవ చేస్తా. ఇక మీకు.. మీ పార్టీకి ఓ దండం. ఇకనైనా మమ్మల్ని బతకనివ్వండి. ఇంతకాలం అవమానాలకు గురైనా తట్టుకున్నాం.. మానసికంగా అవమానాలకు గురవుతున్నా భరించాం.. కానీ ఇవాళ భౌతికంగా లేకుండా చేస్తే ఎందుకు.'అని అడ్లూరి లక్ష్మణ్‌ను జీవన్ రెడ్డి ప్రశ్నించారు.

## రష్యాలో బ్రిక్స్ దేశాల సదస్సు..రష్యాకు చేరుకున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,అక్టోబర్22: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల రష్యా పర్యటనకు బయల్దేరారు. రష్యాలోని కజాన్‌లో 16వ బ్రిక్స్ సమ్మిట్‌లో మోదీ పాల్గొంటారు. ఈ పర్యటనలో ప్రధాని బ్రిక్స్ సభ్య దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. బ్రిక్స్ ప్రారంభించిన కార్యక్రమాల పురోగతిని అంచనా వేయడంతోపాటు.. ప్రపంచాభివృద్ధి, భద్రతపై చర్చిస్తారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇందులో పాల్గొంటారు. బ్రిక్స్‌కు భారత్ అధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ఈ బ్రిక్స్ సదస్సులో పలువురు నేతలను కలుసుకుంటానని చెప్పారాయన. పలు అంశాలపై విస్తృతంగా చర్చ జరుగుతుందని మోదీ ట్వీట్‌లో తెలిపారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ బ్రిక్స్ సభ్య దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ తో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. అంతేకాకుండా విడివిడిగా కూడా పలువురు నేతలను కలవనున్నట్లు తెలుస్తోంది.. ఈ సమ్మిట్ లో యుద్ధం సహా పలు కీలక అంశాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. బ్రిక్స్ ప్రారంభించిన కార్యక్రమాల పురోగతిని అంచనా వేయడంతోపాటు.. ప్రపంచాభివృద్ధి, ఆర్థిక వృద్ధి, భద్రతపై చర్చించనున్నారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ ప్రసంగంపై ఉత్కంఠ నెలకొంది. ప్రధాని మోదీ నాలుగు నెలల్లో రష్యా పర్యటనకు వెళ్లడం ఇది రెండోసారి. ఈ ఏడాది జులైలో మోదీ రష్యాలో పర్యటించారు. యుక్రెయిన్‌పై రష్యా దాడి తరువాత మాస్కోలో



ప్రధాని తొలిసారి పర్యటించారు. రష్యాలోని భారత సంతతి ప్రజలతో ముఖాముఖిలో పాల్గొన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానం మేరకు కజాన్ వేదికగా జరిగే 16వ బ్రిక్స్ సమ్మిట్‌లో మోదీ పాల్గొంటున్నారు.2006లో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా దేశాలు బ్రిక్ గ్రూపును ప్రారంభించాయి. 2010లో దక్షిణాఫ్రికా చేరిన తరువాత అది బ్రిక్స్‌గా మారింది. ఈ ఏడాది జనవరిలో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు కూడా చేరాయి. దీంతో బ్రిక్స్ గ్రూపులో ఉన్న దేశాల సంఖ్య పదికి చేరింది.

## రైతాంగ సమస్యలపై బీఆర్ఎస్ ఉద్యమ బాట..

ఆదిలాబాద్ : రైతాంగ సమస్యలపై బీఆర్ఎస్ ఉద్యమ బాట చేపడుతుందని, ఈనెల 24న ఆదిలాబాద్ లో నిర్వహించనున్న బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జోగు రామన్న సర్కార్ తీరుపై నిప్పులు చెరిగారు. బూటకపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని, రైతు భరోసా ఎగ్గొట్టి ప్రభుత్వం రైతుల ఉసురు తీసుకుంటోదన్నారు. ఆరు గ్యారంటీల పేరిట అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం మహిళలకు ఉచిత బస్సు మినహా మిగతా గ్యారంటీలు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.కేసీఆర్ పాలనలో రైతుల ఆత్మహత్యలు లేనీ రాష్ట్రంగా పథకాలు అమలు చేస్తే, 300 రోజుల పాలనలో ఇప్పటికీ 300 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని జోగు రామన్న ఆరోపించారు. ఎకరానికి తమ ప్రభుత్వం పదివేల రైతుబంధు ఇస్తే, అవహేళన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే రూ.15,000 ఇస్తామని నమ్మించి మోసగించారన్నారు. కేబినెట్ సబ్ కమిటీ పేరిట కాలయాపన చేస్తూ రైతులను మోసగిస్తున్న ప్రభుత్వం తీరును రాష్ట్రవ్యాప్తంగా ఎండగడతామన్నారు. పత్తికి గుజరాత్ మార్కెట్లో ఒక ధర కల్పించి రాష్ట్రంలో రు.7520 ప్రకటించడం పట్ల ఎద్దేవా చేశారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, పెళ్లిళ్లు చేసుకున్న పేదలకు తులం బంగారం, రుణమాఫీ, రైతు భరోసా, గృహ జ్యోతి, ఉచిత కరెంటు పేరిట మాయమాటలు చెప్పి నమ్మించి మోసం చేశారని ధ్వజమెత్తారు.



ఈనెల 24న కేటీఆర్ శంఖారావం..

రైతాంగ సమస్యలే ప్రధాన ఏజెండాగా కులమత రాజకీయాలకు అతీతంగా రైతు ఉద్యమాలను చేపడుతున్నామని జోగు రామన్న తెలిపారు. ఈనెల 24న ఆదిలాబాద్ లో మాజీ మంత్రి కేటీఆర్ శంఖారావం పూరించనున్నారని, ఈ బహిరంగ సభకు రైతులందరూ హాజరుకావాలని జోగు రామన్న కోరారు. రైతు సమస్యలపై నిలదీస్తే ప్రశ్నించే గొంతుకులపై కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు.సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేస్తే తనపై కేసులు పెట్టారని, 420 హామీలు ఇచ్చి మోసగించిన సీఎం రేవంత్ రెడ్డిపై 420 చీటింగ్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మెట్టు ప్రహ్లాద, రోక%శీ%డ్ల రమేష్, విజ్జగిరి నారాయణ, మాజీ ఎంపీపీ రమేష్, కౌన్సిలర్లు అల్లాల అజయ్, పవన్ నాయక్, రంగినేని శ్రీనివాస్, కుమ్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

## జనవరి నాటికి బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడు



న్యూఢిల్లీ, జనవరి నాటికి బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎంపిక చేసే అవకాశం ఉంది. దీంతో పాటు రాష్ట్రాల్లోనూ అధ్యక్షులు మారనున్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికల కసరత్తును ప్రారంభించింది.సార్వత్రిక ఎన్నికల సమయంలో జాతీయ అధ్యక్షుడితో పాటు కొన్ని రాష్ట్రాల అధ్యక్షుల పదవీ కాలాన్ని పొడిగిస్తూ పార్టీ తీర్మానం చేసింది. ఇప్పుడు బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియకు లోబడే మార్పులు చేర్పులు జరుగుతాయి. బీజేపీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ ను ఎంపిక చేశారు. బూత్ కమిటీల నుంచి ప్రారంభం చేసి రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయి ఎన్నికలను నిర్వహించనున్నారు. పార్టీ కొత్త కమిటీల ఎన్నికల్లో క్రియాశీలక సభ్యులదే కీలకపాత్ర. మూడు నెలల్లో బీజేపీ సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయనున్నారు. ఇక, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయి.ఇక, బీజేపీ రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ కమలం పార్టీ.. పది కోట్ల మంది ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నారు.. అంతర్గత ప్రజాస్వామ్యానికి అనుగుణంగా ఎన్నికలు జరుగుతాయి. బూత్ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎన్నికల ప్రక్రియ జరగనుంది.. ప్రాథమిక సభ్యత్వాలు పూర్తి చేసుకుని క్రియాశీలక సభ్యత్వాలు కొనసాగుతున్నాయి. బూత్ కమిటీల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది.. దేశవ్యాప్తంగా 10 లక్షల బూతులకు ఎన్నిక జరగనుంది అన్నారు. ప్రతి బూతు కమిటీలో అధ్యక్షుడితో పాటు 11 మంది సభ్యులు ఉంటారు. అన్ని రాష్ట్రాల రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తైంది.. ఒక సామాన్య కార్యకర్తగా వచ్చిన నన్ను ఎలక్షన్ రిటర్నింగ్ అధికారిగా బాధ్యతలు అప్పగించడం గౌరవంగా భావిస్తున్నాను అని డాక్టర్ లక్ష్మణ్ చెప్పారు.ఇక, పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణ కోసం జాతీయస్థాయి వర్క్ షాప్ పూర్తైందని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. రాష్ట్రాల వర్క్ షాప్స్ 25 అక్టోబర్ లోపల నిర్వహిస్తాం.. నవంబర్ 5వ తేదీ వరకు జిల్లాల్లో వర్క్ షాపులు జరుగుతాయి.. నవంబర్ 15 లోపల బూత్ కమిటీల ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. క్రియాశీలక సభ్యత్వం లేకపోతే పార్టీలో బాధ్యతలు ఇవ్వరు.. బీజేపీ ఒక కుటుంబ పార్టీ కా..దు ఒక వర్గం పార్టీ కాదు అని తెలిపారు. బీజేపీలో సామాన్య కార్యకర్తలు జాతీయ స్థాయికి ఎదిగారు.. బీజేపీలో సామాన్యులకు పెద్దపీట అని ఆయన వెల్లడించారు. కార్యకర్తలుగా నమ్మిన సిద్ధాంతాల కోసం పని చేసినటువంటి వాళ్లకు బీజేపీలో కచ్చితంగా గుర్తింపు ఉంటుంది.. జనవరిలోగా పూర్తిచేయాలనేది మా టార్గెట్.. రాశుల అధ్యక్షులు ఎన్నికల తర్వాత జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకుంటాం.. ఎన్నికల ప్రక్రియకు లోబడి అన్ని రాష్ట్రాల్లో మార్పులు చేర్పులు ఉంటాయని లక్ష్మణ్ వెల్లడించారు.

## చంద్రబాబు అడుగులకు మడుగులొత్తడమే మీ అజెండానా?




అమరావతి,ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి మండిపడ్డారు. ఏపీ సీఎం చంద్రబాబును కాపాడటానికి, డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఇంత ఆరోపణలా? మరీ ఇంత మ్యాచ్ ఫిక్సింగ్ అని ప్రశ్నించారు. మీ జెండా, అజెండా అంతా చంద్రబాబు కోసమే అని నిలదీశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని అధికారంలో ఉన్న చంద్రబాబును ప్రశ్నించాల్సింది పోయి, సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చిన వైఎస్ జగన్ మీద విమర్శలు చేయడమేంటని వైఎస్ షర్మిలపై వరుదు కల్యాణి మండిపడ్డారు. అఘాయిత్యాలకు ఆడపిల్లలు బలైపోతుంటే ఎందుకు నోరు కూడా మెదపలేదు.. చంద్రబాబును ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు.దివంగత నేత వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి మరింత వన్నెలద్ది, దాన్ని మరింత పటిష్టంగా జగన్ అమలు చేశారని స్పష్టం చేశారు. ఈ పథకం అమలు విషయంలో తండ్రి కంటే మరో నాలుగు అడుగులు ముందుకేశారని గణాంకాలే చెబుతున్నా యని వివరించారు. కోర్సులకు ఎంత ఖర్చయితే అంతా సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం ఏడాదిపాటు వేచి చూడాల్సిన అవసరం లేకుండా ప్రతి మూడు నెలలకోసారి చెల్లింపులు చేశారని పేర్కొన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం బకాయిపెట్టిన రూ.1778 కోట్లను చెల్లించడంతో పాటు, విద్యా దీవెన, వసతి దీవెనల కింద మొత్తంగా రూ.18,663 కోట్లు చెల్లించి విద్యార్థులకు, పేద కుటుంబాలకు అండగా నిలిచారని అన్నారు. ఇవన్నీ వాస్తవాలు అయితే, మీరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని షర్మిలపై మండిపడ్డారు. కేవలం పొలిటికల్ డైవర్షన్‌కోసమే కదా ఇది అని ఆగ్రహం వ్యక్తం చేశారు.2024 సంవత్సరానికి సంబంధించి జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన ఫీజులను ఏప్రిల్, మే నెలలో ఇవ్వాల్సి ఉందని వరుదు కల్యాణి తెలిపారు. ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి చంద్రబాబు ఫిర్యాదు చేయడంతో వాటి విడుదల నిలిచిపోయిందని అన్నారు. ఆతర్వాత ఏప్రిల్ జూన్ త్రైమాసికం, జులై-ఆగస్టు-సెప్టెంబరు త్రైమాసికంగా, మొత్తంగా మూడు త్రైమాసికాలకు సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద దాదాపుగా రూ.2100 కోట్లు చెల్లించాల్సి ఉందని అన్నారు. కాని ఇప్పటివరకూ చెల్లించని చంద్రబాబును నిలదీయకుండా జగన్ మోహన్ రెడ్డిని ప్రశ్నించడం వెనుక మీ ఉద్దేశాలు ఏంటని షర్మిలను నిలదీశారు. ఇది టీడీపీతో మీకున్న మ్యాచ్ ఫిక్సింగ్ కాదంటారా అని ప్రశ్నించారు.వసతి దీవెన కింద ఇచ్చే పిల్లల హాస్టల్ ఫీజులకూ ఎన్నికల కోడ్ అడ్డం రాడంతో మార్చి-ఏప్రిల్‌లో చెల్లించాల్సిన రూ.1,100 కోట్లు నిలిచిపోయాయని వరుదు కల్యాణి తెలిపారు. మరో విడత కూడా దగ్గరపడుతోందన్నారు. పిల్లల చదువులు, హాస్టల్ ఫీజుల కింద చంద్రబాబు ఫీజురీయింబర్స్‌మెంట్, హాస్టల్ ఫీజుల కింద ఈ రెండింటికి కలిపి ఇప్పటివరకూ పడ్డ బకాయిలు రూ.3200 కోట్ల పై మాటే అని అన్నారు. పథకాలకు పేర్లు అయితే మార్చారు కాని అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా.. ఒక్కపైసా ఇవ్వలేదని తెలిపారు. మరి మీరు ప్రశ్నించాల్సింది ఎవర్ని అని షర్మిలను ప్రశ్నించారు. డబ్బులు ఇవ్వాల్సిన చంద్రబాబునా? లేక పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన జగన్‌నా? అని నిలదీ శారు.కేవలం చంద్రబాబును కాపాడాలన్న తపనకొద్దీ తప్పుడు ఆరోపణలు ఎందుకు చేస్తున్నారని షర్మిలను వరుదు కల్యాణి ప్రశ్నించారు. ఒక రాజకీయపార్టీగా మీకు అజెండా ఉందా? లేక బాబుగారి అడుగులకు మడుగు లొత్తడం, ఆయన కోసం డైవర్షన్ పాలిటిక్స్ చేయడమే మీ అజెండానా? అని నిలదీశారు. జగన్ మోహన్ రెడ్డిగారి మీద మీకు అంత అసూయ ఎందుకు ? అని అడిగారు

## డ్రోన్ టెక్నాలజీ భవిష్యత్తులో గేమ్ ఛేంజర్

అమరావతి,విదేశాల్లో ఉన్న మనదేశ ఐటీ నిపుణుల్లో 30 శాతం తెలుగువాళ్లే ఉన్నారు. మంగళవారం అమరావతిలో డ్రోన్ సమ్మిట్ -2024ను ఆయన ప్రారంభించి స్టాళ్లను పరిశీలించారు.పౌర విమానయానశాఖ, డీఎఫ్ఐ, సీఐఐ భాగస్వామ్యంతో నిర్వహించిన సదస్సులో సీఎం మాట్లాడారు. ఇటీవల విజయవాడ వరదల్లో డ్రోన్లు వినియోగించామని తెలిపారు. విజయవాడలో వరదలప్పుడు డ్రోన్ల ద్వారా ఆహారాన్ని అందించామని వెల్లడించారు. వ్యవసాయం, మౌలిక వసతుల రంగంలో డ్రోన్లది కీలక పాత్ర వహిస్తాయని అన్నారు. 1995లో తొలిసారి సీఎం అయ్యాక ఐటీపై దృష్టిని సారించానని పేర్కొన్నారు.ఐటీ నాలెడ్జ్ ఎకానమీలో భారీతీయు చాలా సమర్థులని అన్నారు. ఏపీలో శాంతి భద్రతల పరిరక్షణకు , ట్రాఫిక్ సమస్యల నివారణకు డ్రోన్లను వినియోగిస్తామని చంద్రబాబు తెలిపారు. డ్రోన్లతో నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించవచ్చని వివరించారునివాస అనుకూల నగరాల్లో దేశంలోనే బెస్ట్ సిటీ హైదరాబాద్ అని కొనియాడారు. ఇప్పుడు నిజమైన సంపద అంటే డేటా అని అన్నారు.డిజిటల్ కరెన్సీ లావాదేవిల్లో ప్రపంచంలో మనమే నెంబర్‌వన్‌గా ఉన్నామని వివరించారు. డేటాసాయంతో ఏఐ, ఎంఎల్ మరింత అభివృద్ధి




చెందనున్నాయని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మరిన్న గ్రీన్‌ఫీల్డ్ విమానా( శ యాలు ఆంధ్రప్రదేశ్‌కు వస్తాయని వెల్లడించారు.. ఈ సమావేశంలో కేంద్ర విమానాయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, బీసీ జనార్దన్ రెడ్డి, సంధ్యారాణి, పాల్గొన్నా రు.

## ఆర్థిక నిర్వహణ సూచికలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానం..



హైదరాబాద్ : గత పాలకులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు.. ఆర్థిక నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని నిత్యం అసత్యాలు, అబద్దాలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. తమ ప్రభుత్వ హయాంలో ఆర్థిక నిర్వహణ ఎలా ఉందో చెప్పడానికి ఈ సాక్ష్యం సరిపోతోందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ రిపోర్టుతో కాంగ్రెస్, బీజేపీ అబద్ధాలు బట్టబయలు అయ్యాయని, ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందన్నారు.2 014-15 నుండి 2022-23 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాల ఆర్థిక నిర్వహణ సూచికలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. ఈ సమయంలో ఆర్థిక నిర్వహణలో తెలంగాణ ఓ వెలుగు వెలిగిపోయింది. డెబ్ట్ మేనేజ్‌మెంట్ అండ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ఇండెక్స్‌లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. కేసీఆర్ ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం అసాధారణమైన ఆర్థిక వివేకం,

## సంపాదకీయం

**బుధవారం 23-10-2024**

# రాజకీయ పబ్బం కోసం విమర్శలు !

తెలంగాణ, ఆంధ్రాలో విపక్షంలో ఉన్న బిఆర్ఎస్, వైకాపాలు తమది ..ఒక్కటే రాగం అన్న చందంగా విమర్శలతో కాలం గడుపుతున్నారు. అప్పుడే కొంపలు అంటుకు పోయాయని, తాము ఉంటే అంటుకునేవి కావన్న రీతిలో గగ్గోలు పెడుతున్నారు. విమర్శలకు హద్దులు ఉండవన్న రీతిలో రెండు పార్టీల నేతలు రోజూ ఏదో ఒక అంశం తీసుకుని పదేపదే విమర్శలు చేస్తున్నారు. ఎంతగా అంటే ఒకరోజు మీడియాతో మాట్లాడడం, మరుసటి రోజు దానినే ట్విట్టర్ ద్వారా వల్లించడం, తరవాతి రోజు దానిపై సొంత పత్రికల్లో కథనాలు రాయించడం అలవాటు చేసుకున్నారు. నవ్విపోదురు గాక నాకేంటన్న చందంగా ..గత పాపాలను ప్రజలు మరచి పోవాలన్న ఏకైక లక్ష్యంతో జంకూగొంకూ లేకుండా విమర్శలతో కాలం గడిపేస్తున్నారు. ఎపిలో జగన్, తెలంగాణలో కెటిఆర్, హరీష్ రావులు ఈ అబద్దాల ప్రచారంలో ఆరితేరారు. అధికారంలో ఉన్నప్పుడు వివిధ మార్గాల్లో సొంత ఆదాయం పెంచుకున్న వీరు ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న చంద్రబాబు ను, రేవంత్‌ను అడ్డగోలుగా దోచుకుంటున్నారని గగ్గోలు పెడుతున్నారు. అధికారమంటే దోచుకోవడమే అన్న చందంగా ఐదేళ్లు జగన్, పదేళ్లు బిఆర్ఎస్ నేతలు దోచుకున్నది ప్రజలు మరచి పోలేదు. ప్రభుత్వ వనరులను,ఖజానాను కొల్లగొట్టి తమ సొంత వనరులు సమకూర్చుకున్న నేతలుగా చరిత్రలో వీరు నిలిచి పోయారు. అసలు ఎపి విభజన జరిగిందే వీరి ఆదాయాలు పెంచడానికి అన్న చందంగా రాష్ట్రాల తీరు మారింది. అప్పులతో కుదేలు చేశారు. జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి తీసుకుని వచ్చారు. ఎపిలో లిక్కర్ పాలసీతో నాసిరకం మద్యం సరఫరా చేసిన జగన్ అడ్డంగా దోచుకున్నారు. నీతి, నిజాయితీ, విలువలు, విశ్వసనీయత వంటి మాటలు వల్లెవేస్తూ..గతమంతా బంగారు మయం చేశామని ఈ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటు. రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసిన వైకాపా, బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు ప్రజలపై వల్లమాలిన ప్రేమను ఒలకబోస్తున్నారు. జర్నలిస్టులంటే అయ్యో అంటూ రాగాలు తీస్తున్నారు. ప్రజలను ఛీదరించుకునే స్థాయికి దిగజార్చి, వారిని కనీసం దరిచేరకుండా పాలన చేసి, సిఎం కలవాల్సిన అవసర మేముందని దబాయింపు మటలు మాట్లాడిని నేతలు ఇప్పుడు ప్రజలపై ఎక్కడ లేని ప్రేమను ఒలక బోస్తున్నారు. మల్లన్నసాగర్‌లో ప్రజల జీవితాను ముంచేసిన కెసిఆర్ బృందం ఇప్పుడు మూసీ మురికి బాధితుల కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారు. దోచుకోవడమే పాలన అన్నచందంగా సాగిన వీరి ఆగడాలను భరించలేకే ప్రజలు అధికారం నుంచి దించేశారు. సంక్షేమం పేరిట ప్రజలకు డబ్బు పందేరాలు సాగించి, అదే అభివృద్ధి అని నమ్మించి ఎన్నికల్లో ఓటమి పాలైనా వీరికి జ్ఞానోదయం కలగడం లేదు. ఆనాడు దూరం పెట్టిన ప్రజలపై ఇప్పుడు ఎక్కడలేని మమకారం పుట్టుకొస్తోంది. ఓటమి ఎందుకు ఎదురైందో తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడం ఆత్మవంచన చేసుకోవడం తప్ప మరోటి కాదు. ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధంగా లేని నేతలు.. ముఖ్యమంత్రిగా మాత్రమే ఉండాలనుకుంటున్న నేతలను ప్రజలు సమయం చూసి వాతలు పెట్టారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు హైదరాబాద్‌లో నివసించడమేమిటని ప్రశ్నించిన జగన్ ఇప్పుడు తాను బెంగళూరులోని ప్యాలెస్‌లో ఎందుకు సేదదీరుతున్నారో చెప్పాలి. అలాగే అసెంబ్లీకి రాని, ప్రజల సమస్యలను పట్టించుకోని ఫామ్‌హౌజ్ కే పరిమితమైన కెసిఆర్ విపక్షనేతగా ఉండాలా అన్నది కూడా ప్రజలు ఆలోచించాలి. ఇలాంటి వారిలో పరివర్తన వస్తుందని, రావాలనుకోవడం అమాయకత్వమే అవుతుంది. అధికారంలో ఉన్నప్పుడు చెయ్యాల్సిన దురాగతాలన్నీ చేసి ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి, పత్రికా స్వేచ్ఛ గురించి, పోలీసుల వేధింపుల గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. ఇది చాలదన్నట్లు ఇప్పటి కిప్పుడు ఎన్నికలు జరిగితే తమదే అధికారం అని బిఆర్ఎస్ తమ బాకా పత్రికలో కథనాలు రాయించు కుంటోంది. తెలంగాణలోమూసీ మురికి వదలకూడదు. అక్రమంగా రైతుబంధును అమలు చేసిన తీరును అడ్డుకోరాదు. అక్రమంగా బతుకమ్మ చీరల పేరుతో జరిగిన అన్యాయాలను నిలదీయరాదు. నిరుద్యోగులకు టోపీ పెట్టిన వైనాన్ని నిలదీయరాదు. మిష్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, ధరణి అవినీతుల గురించి మాట్లారాదు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన జరగాలని ఆకాక్షించి గ్రూప్ పరీక్షలు నిర్వహిస్తే వాటిని అడ్డుకోవడం అలవాటు చేసుకున్నారు. రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే ముఠాలు తయారయ్యాయి. ఇదంతా చూస్తున్న తెలుగు ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలకు తగిన శాస్తి జరిగిందని సరిపెట్టుకుంటున్నారు. ప్రజలను కలవాల్సిన అవసరం సిఎంకు ఏమిటన్న కెటిఆర్ నిజాలు గ్రహించడం లేదు. హరీష్‌రావు కూడా ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారు. దుష్ట సంప్రదాయాలకు తలపడితే దాని పర్యవసానాలు ఇలాగే ఉంటాయి. మీడియాపై అక్కసు వెళ్లగక్కిన ఇరు రాష్ట్రాల పెద్దలు ఇప్పుడు మీడియాపై ప్రేమ ఒలక బోస్తున్నారు. ఎపిలో ఇప్పుడు పోలీసు కేసులు, వేధింపులు, పత్రికా స్వేచ్ఛ అంటూ జగన్ అండ్ కో గగ్గోలు పెట్టడం చూస్తే జాలేస్తోంది. అయితే గతంలో అధికారం అడ్డు పెట్టుకుని అక్రమాలకు పాల్పడి, అవినీతికి తెగించి, ఆర్థిక విధ్వంసం సృష్టించిన వారిపై చర్యలు ఉండాల్సిందే. లేనిపక్షంలో అలాంటి వారిలో లెక్కలేనితనం పెరుగుతుంది. తమకేమీ కాదులే అన్న ధీమా రాజకీయ నేతల్లో రాకూడదు. జవాబుదారీతనం తీసుకుని రావాలి. ఇకపోతే గత పదేళ్లలో తెలంగాణను దోపిడీ చేశారని, కాళేశ్వరంను ఎటిఎంలా వాడుకున్నారని గగ్గోలు పెట్టిన బిజెపి నేతలు కూడా బిఆర్ఎస్ నేతలతో కలసి వంతపాడడం శోచనీయం. ఇద్దరు కేంద్రమంత్రులు తెలంగాణ అభివృద్ధి గురించి కాకుండా ప్రభుత్వం కాళ్లల్లో కట్టెల్లు పెడుతున్నారు. బిఆర్ఎస్ నేతలకు వంత పాడేలా విమర్శల చేస్తున్నారు. నిర్మాణాత్మక పాత్ర పోషించడలో వీరు విఫలం అయ్యారు. నరేంద్రమోడీ పాలనే బ్రహ్మాండంగా ఉందని ప్రచారం చేసుకుంటే సరిపోదు. ప్రజలు ఏమనుకుంటున్నారో ఈ ఇద్దరు కేంద్రమంత్రులు తెలుసుకుంటే మంచిది. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను, వారు ఎదుర్కొంటున్న సమస్యలను బిజెపి చర్చించాలి. అలా చేసే ధైర్యం ఉందా అన్నది చెప్పాలి.

# ఉన్నత అవకాశాలకే విదేశీవలస



న్యూఢిల్లీ,మైగ్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ (తిరువనంతపురం) సర్వే ప్రకారం 2023లో కేరళ నుంచి విదేశాలకు ఉన్నత చదువులకోసం 2.5 లక్షల మంది విద్యార్థులు వలస వెళ్లారు. దేశం మొత్తం మీద విదేశాలకు వెళ్లిన మొత్తం విద్యార్థుల సంఖ్యలో కేరళ విద్యార్థుల సంఖ్యే 20% వరకు ఉంటోందని తేలింది. కేరళ నుంచి ఇంత భారీ ఎత్తున విద్యార్థులు వలస వెళ్లడానికి దారి తీసే పరిస్థితులు ఏమిటి? ఈ విధమైన పరిస్థితి కేరళ రాష్ట్రంలోని సామాజిక, ఆర్థిక అంశాలపై విపరీత ప్రభావం చూపిస్తుంది. ఏ దేశంలో ఉపాధికి, ఉద్యోగాలకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయో, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎక్కడ ప్రోత్సాహకర వాతావరణం ఉంటుందో అక్కడకు ప్రజలు వలస వెళ్లడం సహజం. అలాగే విద్యార్థుల ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు భారీ ఎత్తున అవకాశాలు ఉంటున్నందున విద్యార్థుల వలస విశేష సంఖ్యలో కొనసాగుతోంది.కేరళలో విద్యావంతులు ఎక్కువే. నిరుద్యోగమూ ఎక్కువే. ఉద్యోగాలను ఆశిస్తూ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజిల్లో 2023లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి సంఖ్య 29 లక్షలు దాటింది. వీరిలో ఎస్ఎస్ఎల్‌సి లేదా అంతకన్నా ఎక్కువ చదువుకున్న వారి సంఖ్య 23 లక్షల వరకు ఉంది. సాంకేతికంగా అర్హత కలిగిన వారు 3.5 లక్షలకు పైబడి ఉన్నారు. దీనికి తోడు యూనివర్శిటీల చదువులు పూర్తి చేసుకుని ఏటా లేబర్ మార్కెట్‌లోకి చేరుతున్న వారి సంఖ్య మరో లక్ష వరకు ఉంటోంది. మరోవైపు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న వారి సంఖ్య 20 లక్షలు దాటింది. అలాంటి గెస్ట్ వర్కర్లు ఏ పని చేయడానికైనా సిద్ధంగా ఉంటారు. కానీ నిరుద్యోగులైన విద్యావంతులు మాత్రం ఏపని అయినా చేయడానికి సిద్ధంగా ఉండరు. వీరు తమ సామాజిక హోదాకు తగ్గట్టు ఎక్కువ వేతనం అందించే సుస్థిరమైన ఉద్యోగాలను ఆకాంక్షిస్తుంటారు. అయితే అలాంటి ఉద్యోగాలు చాలా తక్కువగా ఉండటంతో నిరుద్యోగులు అలాగే ఉండిపోతున్నారు. మొత్తం మీద వలస విద్యార్థులు ముఖ్యంగా అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జర్మనీ, ఇతర అభివృద్ధి చెందిన దేశాలకు వెళ్లడానికి ముందు వరుసలో ఉండడం పరిపాటి. ఈ దేశాల్లో ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీగా లభించే అవకాశాలు పుష్కలంగా ఉండడమే ఈ ఆకర్షణకు కారణం.కేరళలో ఇచ్చే వేతనం కన్నా అనేక రెట్లు వేతనం విదేశాల్లో ఇస్తున్నారు. ఉదాహరణకు అమెరికాలో పనిచేసే ఒక నర్సు నెలకు రూ. 4,00,000 వరకు సంపాదిస్తోంది. దీనికి తోడు విలాసవంతమైన నివాసం, కార్లు, అత్యంత ఆధునికమైన పరికరాల వినియోగం కేరళలో ఉండే తమ తల్లిదండ్రులకు అందేలా చేస్తోంది. విదేశాల్లో ఈ విధంగా సంపాదించే వేతనాల్లో కనీసం పదోవంతైనా కేరళలోని నర్సుకు దక్కడం లేదు. కలలోనైనా అలాంటి విలాస జీవనం ఊహించే అవకాశం కలగదు. నర్సులే కాదు, దాదాపు అన్ని కేటగిరీలకు చెందిన వర్కర్లు కేరళలో తమ వేతనాలతో అలాంటి విలాసవంత జీవితాన్ని కలగనడానికైనా అవకాశమే ఉండదు. వలస వెళ్లిన వారి కుటుంబాలు కేరళలో అత్యంత విలాసవంతమైన జీవితాలను గడుపుతున్నారు. ఈ కుటుంబాల యువకులు, కుర్రాళ్లు సాధారణంగా తమకు తాము విలాసవంతమైన జీవితాన్నే కోరుకుంటారు. అలాంటి బంగారు స్వప్నాలు వారిని విదేశాలకు వెళ్లి చదువుకోడానికి, అక్కడే ఉద్యోగాలు చేయడానికి దోహదం చేస్తున్నాయి. అయితే చాలా మందికి విదేశాలకు వలస వెళ్లడం పూలబాట కాకపోవచ్చు. అమెరికా ఇటీవల తీసుకున్న నిర్ణయం భారతీయ కుటుంబాలకు చెందిన వేలాదిమంది పిల్లల భవిష్యత్తు త్రిశంకు స్వర్గంగా ఉంటోంది.చిన్నవయసులో తల్లిదండ్రులతో కలిసి అమెరికాకు వచ్చినవారు అక్కడే పెరిగి, చదువులు పూర్తి చేసుకుని తమకు 21 ఏళ్లు రాగానే అమెరికా ప్రభుత్వం వారిని స్వదేశానికి దయచేయండి అని చెప్పడం వివాదాస్పదంగా తయారైంది. ఇక తెలుగు రాష్ట్రాల విద్యార్థుల పరిస్థితిని పరిశీలిస్తే అమెరికాలో భారతీయ విద్యార్థుల్లో 12.5 శాతం మంది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన తెలుగువారే ఉన్నారు. అందువల్ల ఎవరైనా తెలుగు రాష్ట్రాల నుంచి కొత్తగా అమెరికాకు వస్తే తమ చుట్టూ తెలుగువారే ఎక్కువగా కనిపిస్తుండటంతో వారు విదేశాల్లో ఉన్నామన్న భావన కన్నా స్వంత రాష్ట్రాల్లోనే ఉన్నామన్న అనుభూతి కలుగుతోంది. అమెరికాలో తెలుగు మాట్లాడే జనాభా 2016లో 3,20,000 నుండి 2024 నాటికి 1.23 మిలియన్‌కు పెరిగింది. అమెరికా సెన్సస్ బ్యూరో డేటా ఆధారంగా కాలిఫోర్నియాలో అత్యధికంగా తెలుగు మాట్లాడే జనాభా దాదాపు 2,00,000 వరకు ఉంది. ఇప్పుడు అమెరికాలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో 11 స్థానంలో తెలుగు ఉంది.

# మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టులో 'అదానీ' కనెక్షన్?




హైదరాబాద్,నగరంలో పరిష్కరించాల్సిన అనేక సమస్యలు ఉన్నాయి. అడ్డగోలు అనుమతులతో ఇప్పటికే అతి త్వరలో హైదరాబాద్ నగరం నివాసయోగ్యంగా ఉండే అవకాశాలు లేవనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశంలోని ఒక కీలక నగరంగా ఉన్న హైదరాబాద్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్లో ట్రాఫిక్ వంటి కీలక అంశాలు ఉన్నాయి. ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు.. గుంపులు గుంపులుగా ఎక్కడపడితే అక్కడ ఆగిపోయే ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాల నుంచి పుట్టే పొగ భూతాలు సృష్టిస్తున్న వినాశనాన్ని అంచనా వేస్తే గుండెలు అదరక మానవు. దీనితో పోల్చితే మూసీ కాలుష్యం లెక్కలోకి కూడా రాదనే అభిప్రాయాలు ఉన్నాయి. మరి ఇంత సడన్‌గా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మూసీ ప్రక్షాళనపై ఎందుకంత మమకారం పుట్టుకొచ్చిందనే విషయంలో భిన్నాభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. మూసీని కాలుష్యం బారి నుంచి రక్షించాల్సిందే. కానీ.. దీని వెనుక వేరే ఉద్దేశాలు ఉంటే మాత్రం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధిని ప్రశ్నించాల్సి వస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.కృష్ణా, గోదావరి, గంగ, యమున పేర్ల మీద ఆడబిడ్డలకు పేర్లు పెట్టుకుంటున్నామని, కానీ ఏ తండ్రయినా తన బిడ్డకు మూసీ అని పేరు పెట్టుకున్నాడా? అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ2024, అక్టోబర్ 6వ తేదీన హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో 'కొలువుల పండుగ' పేరుతో నిర్వహించిన సభలో ఆవేదన వ్యక్తం చేశారు. మూసీని అద్భుతంగా తీర్చిదిద్దినప్పుడు కచ్చితంగా తల్లిదండ్రులు తమ బిడ్డలకు మూసీ అనే పేరు పెట్టుకుంటారని విశ్వాసం కూడా వ్యక్తం చేశారు. అయితే.. మూసీ ప్రక్షాళన అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మరోవైపు అదే మూసీని మరింత కాలుష్యకారకంగా తయారు చేసేందుకు అవకాశం ఇస్తుండటం అనుమానాలు రేకెత్తిస్తున్నది. ఇప్పటికే ప్రతిపక్ష బీఆరెస్ నేతలు ముఖ్యమంత్రిని మూసీ విషయంలో టార్గెట్ చేస్తున్నారు. అయితే.. తాజాగా మూసీ ప్రక్షాళనలో అదానీ లింకులు ఉన్నాయనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో (ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా)ని రామన్నపేట సమీపంలోని కొమ్మాయిగూడ(లో ఒక భారీ సిమెంట్ ఫ్యాక్టరీ కోసం 360 ఎకరాల భూమిని సేకరించి పెట్టారని తెలుస్తున్నది. ఇందులో 70 ఎకరాల్లో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని నిర్మించేందుకు రంగం సిద్ధం చేస్తున్నది. అంబుజా సిమెంట్స్ ఎవరిదో కాదు.. ప్రధాని మోదీకి సన్నిహిత వ్యాపార/పారిశ్రామికవేత్తగా చెప్పే అదానీకి సంబంధించినది. రామన్నపేట ఉన్నది మూసీ పక్కనే. ఈ నేపథ్యంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ కోసమే మూసీ ప్రక్షాళన చేపట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిమెంట్ ఫ్యాక్టరీకోసం శుద్ధ జలాలు అవసరం ఉంటాయి. ఇప్పుడు మూసీ ఉన్న పరిస్థితిలో ఆ నీటిని సిమెంట్ ఫ్యాక్టరీ కోసం ఉపయోగించుకోలేని పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఫ్యాక్టరీకి శుద్ధ జలాలు అందించే క్రమంలో మూసీ సుందరీకరణ( పునరుద్ధరణఅనే అంశాలను జోడించారా? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు పారుతున్న మూసీనదిని లైవ్‌గా మార్చడం అంటే.. పై నుంచి నిరంతరం నీరు వచ్చే ఏర్పాటు చేయడమే. అదే నీటిని సిమెంట్ ఫ్యాక్టరీ ఉపయోగించుకుంటుందన్నమాట.వాస్తవానికి గతంలో ఇక్కడ ఈ 360 ఎకరాల భూమిని డ్రైపోర్ట్ కోసం సేకరించారు. కానీ.. ఇదే భూమిలో అంబూజా కంపెనీ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నది. రామన్నపేట వద్ద 70 ఎకరాల్లో 14 వందల కోట్లతో సిమెంట్ ఫ్యాక్టరీని నెలకొల్పేందుకు అనుమతులు కోరింది. ఇప్పటికే కాలుష్యభరిత మూసీతో రామన్నపేట వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు ఇదే ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీ రావడం అంటే.. మూసీని మరింత కలుషితం చేయడమే కాకుండా.. స్థానికుల ఆరోగ్యంపైనా తీవ్ర దుష్ప్రభావాలు చూపుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి డ్రైపోర్టు కోసం సేకరించిన భూమిలో సిమెంట్ ఫ్యాక్టరీని కడతారన్న విషయం బయటకు రావడంతో స్థానికులు ఆందోళనకు కూడా దిగారు. సిమెంట్ పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యంతో దాదాపు 14 కిలోమీటర్ల పరిధిలో ప్రజలను ప్రభావితం చేస్తుందనే అభిప్రాయాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలోని సాగు భూములన్నీ ఎందుకూ పనికిరాకుండా పోతాయని రైతు సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్లాంటుకు అనుమతి ఇవ్వడం అంటే మూసీని మరింత కాలుష్యకారకంగా మార్చివేయడమేనని పలువురు పర్యావరణ వేత్తలు సైతం చెబుతున్నారు.ఇప్పటికే మూసీ పుట్టిన ప్రాంతమైన వికారాబాద్ అడవుల్లోని దామగుండం ప్రాంతాన్ని ఎన్ని విమర్శలు వ్యక్తమవుతున్నా, తీవ్ర నిరసనలు వచ్చినా వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రం ఏర్పాటుకు గాను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అప్పగించింది. ఇక్కడ అటవీ విధ్వంసం ఉండబోదని ముఖ్యమంత్రి చెబుతున్నా.. దాదాపు 12 లక్షల చెట్లు నరికివేస్తారని ప్రచారం జరుగుతున్నది. అది మూసీని నేరుగా ప్రభావితం చేస్తుందనే అభిప్రాయాలు బలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో లక్షన్నర కోట్లతో మూసీ పునర్జీవం లేదా పునరుద్ధరణ ప్రాజెక్టు ఉద్దేశాలేంటన్న చర్చ నడుస్తున్నది. ఉన్న దానిని మరింత నాశనం చేసి, కొత్త కాలుష్యాలు పారేందుకు చేపట్టారా? అనే అనుమానాలను పలువురు నెటిజన్లు లేవనెత్తుతున్నారు. రామన్నపేట వద్ద అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ కోసమే మూసీ ప్రాజెక్టును చేపట్టారా? అనే సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రత్యేకించి నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు అనుమానాలను నివృత్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

కొసమెరుపు

మూసీ పేరు ఎవరూ పెట్టుకోవడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్న మాట విని.. పలువురు తెలంగాణ ఉద్యమకారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మూసీ పేరు తెలంగాణ జనజీవితంతో పెనవేసుకుని ఉన్నది. రేవంత్‌రెడ్డికి చరిత్ర తెలియదని తెలంగాణ సీనియర్ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య ఒక ఇంటర్వ్యూలో విమర్శించారు. ఉద్యమకారుడు పిట్టల శ్రీశైలం తన కుమార్తెకు ముచ్కుంద (మూసీ) అని పేరు పెట్టారని, తన టెలివిజన్‌కు మూసీ టీవీ అని నామకరణం చేశారని ఆయన గుర్తు చేశారు. ప్రముఖ రచయిత బీఎస్ శాస్త్రి తన ముద్రణాసంస్థకు మూసీ పబ్లికేషన్స్ అనే పేరు పెట్టిన విషయాన్ని పలువురు ప్రస్తావిస్తున్నారు. వాస్తవానికి మూసీ ఇంత కాలుష్యభరితంగా మారడానికి గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలే కారణమనే విమర్శలు బలంగా ఉన్నాయి.

## పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను వేగంగా పూర్తి చేయండి

పట్నా,బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పాల్గొన్న ఓ కార్యక్రమంలో నాటకీయ సన్నివేశం చోటుచేసుకుంది. రాష్ట్రంలో పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను వేగంగా పూర్తి చేయాలంటూ డీజీపీ అలోక్‌రాజ్‌ను సీఎం చేతులు జోడించి అభ్యర్థించడంతో అంతా షాక్ అయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కొత్తగా ఎంపికైన 1,239 మంది పోలీస్ అధికారులకు నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది.ఈ సందర్భంగా సీఎం నీతీశ్ ప్రసంగిస్తూ మధ్యలో ఆగి డీజీపీ వైపు చూస్తూ.. 'త్వరగా రిక్రూట్‌మెంట్ జరిగేలా చూస్తారా?' అని చేతులు జోడించి అడిగారు. దీంతో షాకైన డీజీపీ.. ఆయనకు సెల్యూట్ చేశారు. మైక్ వద్దకు వెళ్లి మాట్లాడుతూ.. సీఎం ఆదేశాలు అమలు చేసేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారన్నారు. త్వరితగతిన రిక్రూట్‌మెంట్ పూర్తి చేసి.. పటిష్టమైన శిక్షణ అందిస్తామన్నారు. దీంతో సీఎం ఆయనకు థాంక్స్ చెప్పారు.

# బీజేపీ గురి..

హైదరాబాద్,తెలంగాణలో భారతీయ జనతా పార్టీ మరింత బలపడేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో బీజేపీకి స్థానాలు దక్కకపోయినా.. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో మంచి ఫలితాలనే రాబట్టింది. ఎనిమిది నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడంతో.. తెలంగాణలో బలమైన పార్టీగా ఎదుగుతున్నట్లు బీజేపీ చాటింది. తాజాగా కాంగ్రెస్ పార్టీపై బీజేపీ దూకుడుగా ముందుకెళున్నది. ప్రధాన ప్రతిపక్షం తరహాలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ అధికార పార్టీకి సవాళ్లు విసురుతోంది. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలపై బీజేపీ గురి పెట్టింది. వచ్చే ఏడాది జరిగే గ్రేటర్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలని ఆ పార్టీ నేతలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏపీలో ఎన్డీయే కూటమిలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉన్నాయి. తెలంగాణలోనూ తెలుగుదేశం, జనసేన పార్టీలను కలుపుకొని గ్రేటర్ ఎన్నికల్లో పోటీ చేయాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు. ముఖ్యంగా తెలుగుదేశం లాంటి బలమైన పార్టీ అండదండలు ఉంటే గ్రేటర్‌లో విజయం నల్లేరుపై బండి నడకే అవుతుందని బీజేపీ అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.గత పదేళ్లుగా గ్రేటర్ హైదరాబాద్ లో బీఆర్ఎస్ హవా కొనసాగుతూ వచ్చింది. రాజకీయంగా బీఆర్ఎస్ బలంగా ఉన్నప్పుడు కేసీఆర్ ఏ గేమ్ ఆడితే అదే హైదరాబాద్ లో కీలకంగా మారేది. కానీ, ఇప్పుడు కథ మారింది. బీఆర్ఎస్ క్రమంగా తన ప్రాబల్యాన్ని కోల్పోతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో గ్రేటర్ లోని పలువురు నేతలు పార్టీని వీడారు. గ్రేటర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విజయం సాధించారు. అయితే, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని మరోసారి నిలబెట్టుకోలేక పోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రేటర్ పై ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో బీఆర్ఎస్ కి చెందిన పలువురు ఎమ్మెల్యేలతో పాటు గ్రేటర్ మేయర్, డిప్యూటీ మేయర్ సహా పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ లో చేరారు. దీంతో గ్రేటర్ లో కాంగ్రెస్ పార్టీ బలోపేతమైంది. గ్రేటర్ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ లోని కీలక నేతలు ఆ పార్టీని వీడే అవకాశాలు కనిపిస్తున్నాయి.దీంతో ఈసారి గ్రేటర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో స్థానానికి పడిపోతుందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వినపడుతోంది. మరో వైపు కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ, హైడ్రా పేరుతో హడలెత్తిస్తోంది. ముఖ్యంగా నగరంలో చెరువులు, నాళాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. ఈ పరిణామం నగర వాసుల్లో ఆందోళన కలిగిస్తోంది. మరో ఏడాదిలో గ్రేటర్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాకు, మూసీ సుందరీకరణకు ఎందుకు ప్రాధాన్యతనిస్తున్నారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. గ్రేటర్ పరిధిలోని పలువురు కాంగ్రెస్ నేతలు సైతం ప్రభుత్వ తీరును తప్పుపడుతున్నారు. మరో వైపు ప్రభుత్వ తీరుపై గ్రేటర్ వాసుల్లోనూ వ్యతిరేకత పెరుగుతోంది. ఈ పరిణామాలను తమకు అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ రంగం సిద్ధం చేసుకుంటున్నది. గ్రేటర్ పరిధిలో ఎక్కువగా సెటిలర్స్ ఉన్నారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారు ఎన్నోఏళ్లుగా హైదరాబాద్ నగరంలో స్థిరపడిపోయారు. వీరంతా ఎక్కువ శాతం తెలుగుదేశం మద్దతుదారులు. రాష్ట్ర విభజన తరువాత తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పెదగా క్రీయాశీలంగా లేకపోవటంతో గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం శ్రేణులు, సానుభూతిపరులు బీఆర్ఎస్, కాంగ్రెస్ లకు మద్దతుగా నిలుస్తూ వస్తున్నారు.ఇప్పుడు గ్రేటర్ పరిధిలోని తెలుగుదేశం సానుభూతిపరులను తమవైపుకు తిప్పుకొనేలా బీజేపీ ప్లాన్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.వచ్చే ఏడాది జరిగే గ్రేటర్ ఎన్నికల్లోనూ మూడు పార్టీలూ కలిసి పోటీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఈ విషయాన్ని బీజేపీ పెద్దలు టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా.. చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో తెలుగుదేశం పోటీకి దూరంగా ఉంది. బీజేపీతో పొత్తు ఉంటుందని, ఖమ్మం, హైదరాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ తోపాటు పలు జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు బరిలోకి దిగుతారని ప్రచారం జరిగింది. కానీ, తెలంగాణ బీజేపీలోని కొందరు నేతలు తెలుగుదేశంతో పొత్తుకు అభ్యంతరం చెప్పడంతో బీజేపీ ఒంటరిగా ఎన్నికలకు వెళ్లింది. తెలుగుదేశం పోటీకి దూరంగా ఉంది. దీంతో తెలుగుదేశం సానుభూతిపరులు అధికశాతం మంది రేవంత్ రెడ్డి నాయకత్వం వహించిన కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచారు. మరో ఏడాది తరువాత జరగబోయే గ్రేటర్ ఎన్నికల్లోనూ టీడీపీ పోటీలో లేకుంటే ఆ పార్టీ మద్దతుదారులు కాంగ్రెస్ కే మద్దతుగా నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన తప్పుచేయకుండా, తెలుగుదేశంతో కలిసి పోటీ చేస్తేనే బాగుంటుందని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు. తెలుగుదేశంతోపాటు జనసేనని కూడా కలుపుకొని గ్రేటర్ ఎన్నికలకు వెళితే మేయర్ పీఠాన్ని దక్కించుకోవటం సాధ్యమవుతుందని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. అయితే, ఎన్నికలకు మరో ఏడాదిన్నర సమయం ఉండటంతో ఆ సమయానికి రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు ఏ విధంగా మారుతోయో వేచి చూడాల్సిందే.

# విపక్ష బిఆర్ఎస్ నేతల గృహనిర్బంధం

హైదరాబాద్, గ్రూప్ 1 పరీక్షలు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న నేపథ్యంలో విపక్ష బీఆర్ఎస్ నేతలను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాసం వద్ద పోలీసులు పహారా కాసారు. బంజారాహిల్స్ నందినగర్‌లోని కేటీఆర్ ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. వందల సంఖ్యలో పోలీసులను మోహరించి, పదుల పోలీసు వాహనాలను ఉంచారు. నందినగర్ ప్రాంతమంతా పోలీసు బలగాలతో నిండిపోయింది.గ్రూప్-1 మెయిన్స్ వాయిదా వేయాలని కోరుతున్న అభ్యర్థుల తరఫున విపక్షాలు నిరసనలు చేస్తున్న విషయం తెలిసిందే. కాసేపట్లో పరీక్ష ప్రారంభం కాబోతున్నందనా.. రాజకీయ నిరసనలు జరగి, పరీక్షలకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. కేటీఆర్ తోపాటు బీఆర్ఎస్ సీనియర్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరుల ఇళ్ల బయట గస్తీ కాస్తున్నారు.

## తిరుమలలో 31న దీపావళి ఆస్థానం

తిరుమల,తిరుమల శ్రీవారి ఆలయంలో అక్టోబరు 31 న దీపావళి ఆస్థానం జరగనుంది. ఏలా దదీపావళి ఆస్థానం నిర్వహించడం పరిపాటి. దీపావళి ఆస్థానాన్ని టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించనుంది. దీపావళి రోజు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు బంగారు వాకిలి ముందు గల ఘంటా మండపంలో దీపావళి ఆస్థానం నిర్వహించనుంది. ఆస్థానంలో భాగంగా శ్రీమలయప్పస్వామి దేవేరులతో కలిసి ఘంటా మండపంలో ఏర్పాటు చేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారు.

# సియోల్‌లో మంత్రుల బృందం పర్యటన

హైదరాబాద్,దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను మంత్రుల బృందం సందర్శించింది. అలాగే అక్కడ చెత్త సేకరణ, మురికి నీటి నిర్వహణ తదితర పద్ధతులను కూడా పరిశీలించింది. సియోల్‌లో తెలంగాణ మంత్రులు, అధికారుల బృందం పర్యటిస్తోంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పలువురు ఎమ్మెల్యేలు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ, మూసీ రివర్‌ఫ్రంట్ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. మాపో ప్లాంట్‌లో రోజుకు వెయ్యి టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. వ్యర్థాల రీసైక్లింగ్‌కు వేస్ట్ టు ఎనర్జీ టెక్నాలజీని సియోల్ నగరపాలక సంస్థ వాడుతోంది. పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. మరో 10 ఏళ్లలో పూర్తిగా భూ ఉపరితలం నుంచి తొలగించి భూగర్భంలో అతిపెద్ద ప్లాంట్‌ను నిర్మించేందుకు సియోల్ నగర పాలక సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాపో ప్లాంట్ పనితీరును అధ్యయనం చేసేందుకు తెలంగాణ మంత్రుల బృందం వెళ్లింది. ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ సియోల్, హైదరాబాద్ నగర నమూనాలు ఒకేలా ఉంటాయని తెలిపారు. సియోల్‌లో సుమారు 10వేల మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి నగరంలోని నాలుగు వైపులకు తరలిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో దాదాపు 8వేల మెట్రిక్ టన్నులు సేకరించి ఒకే వైపునకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరం చుట్టూ నాలుగు ప్రదేశాలను గుర్తించినట్లు వివరించారు. నగరంలోని చెత్తను నాలుగు వైపులకు పంపించడం ద్వారా రవాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ ప్రజల భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూసీ నదిని ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సియోల్‌లో చెయోంగ్ గయ్ చియోన్ నదిని ఆయన పరిశీలించారు.

# పోలీసుల అదుపులో మాజీ మంత్రి కుమారుడు శ్రీకాంత్?

రాజమహేంద్రవరం, దళిత యువకుడు, వాలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో వైకాపా నేత, మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్‌ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. తమిళనాడులోని మధురైలో అతడిని అదుపులోకి తీసుకుని అక్కడి న్యాయమూర్తి ముందు హాజరుపరిచినట్లు సమాచారం. ట్రాన్సిట్ వారెంట్‌పై ఏపీకి తీసుకొచ్చేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. శ్రీకాంత్ అరెస్ట్‌ను రాష్ట్ర పోలీసు అధికారులు నిర్ధరించాల్సి ఉంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో రెండేళ్ల క్రితం జరిగిన దళిత యువకుడి హత్య కేసులో పినిపె శ్రీకాంత్‌ను పోలీసులు ప్రధాన నిందితుడిగా గుర్తించినట్లు సమాచారం. కోనసీమ అల్లర్ల సమయంలో అయినవిల్లికి చెందిన వాలంటీరు దుర్గాప్రసాద్‌ను 2022 జూన్ 6న హత్య చేయించినట్లు నిర్ధరణకు వచ్చారు. ఈ కేసుకు సంబంధించి ఉప్పలగుప్తం మండలానికి చెందిన నిందితుడు, వైకాపా సోషల్ మీడియా కన్వీనర్, మృతుడికి స్నేహితుడైన వడ్డి ధర్మేశ్‌ను పోలీసులు విచారించారు. అతడిని ఈ నెల 18న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో మరో నలుగురు నిందితులతోపాటు పినిపె శ్రీకాంత్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే మదురైలో శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ నెల 18న ధర్మేశ్‌ను విచారించి, వివరాలు సేకరించినట్లు తెలిసింది. అతడు.. మృతుడు దుర్గాప్రసాద్, శ్రీకాంత్‌లకు సన్నిహితంగా ఉంటూ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉండేవారని పోలీసులు నిర్ధరణకు వచ్చారు. దుర్గాప్రసాద్‌ను హత్య చేయించేందుకు నిర్ణయించిన శ్రీకాంత్.. ధర్మేశ్ సహాయం కోరి, మరో నలుగురికి ఆ బాధ్యత అప్పగించినట్లు విచారణలో గుర్తించినట్లు తెలుస్తోంది. హత్యకు స్థానికంగా ఓ ప్రముఖ లాడ్జిలో పథక రచన చేసినట్లు సమాచారం. దుర్గాప్రసాద్‌ను ధర్మేశ్ కోటిపల్లి రేవు వద్దకు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లగా, వెనుక కారులో నలుగురు అనుసరించారు. రేవు వద్ద ఓ వ్యక్తి పడవలో లోపలకు తీసుకెళ్లగా, కారులో వచ్చిన వారిలో ముగ్గురు దుర్గాప్రసాద్ మెడకు తాడు బిగించి, హత్య చేశారని నిందితుడు ధర్మేశ్ చెప్పినట్లు సమాచారం. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు తొలుత మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. కొన్నాళ్లకు మృతదేహం లభించడం, పోస్టుమార్టంలో హత్య చేసినట్లు నిర్ధరణ అయింది.

# నిజమేనా.. !

అమరావతి,వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌లో మారిన మనిషిని చూడొచ్చా? ఇప్పుడు ఇదే ప్రశ్న వైసీపీలో వ్యక్తమవుతోంది. ఆయన పూర్తిగా మార్పు దిశగా అడుగులు వేస్తున్నారా అంటే ప్రస్తుతం జరిగిన నాలుగు సమావేశాలను గమనిస్తే కొంత మార్పు అయితే కనిపిస్తోంది. ఒకప్పుడు అంతా "నేనే" "నన్ను చూసే ప్రజలు ఓట్లు వేశారు" "నేను ఇచ్చిన టికెట్లు నేను చేసిన ప్రచారంతోనే ఎమ్మెల్యేలు గెలిచారు" అని బహిరంగంగా చెప్పకపోయినా అంతర్గత సమావేశాల్లో పదేపదే జగన్ చెప్పుకొచ్చారు."నేను లేకపోతే నీకు పదవి ఏముంది అన్న" అంటూ మాట్లాడిన సందర్భాలు కూడా ఉన్నాయి. కొందరు కొత్త ముఖాలను పరిచయం చేసినప్పుడు చాలామంది "వాళ్లు గెలుస్తారా గెలవరా" అని సందేహం వ్యక్తం చేసిన సమయంలో "అసలు వాళ్లను చూసి ఎవరు ఓటేస్తారు నన్ను చూసి కదా ఓటేస్తారు" అని చాలా గర్వంగా జగన్ చెప్పుకొచ్చారు. మైలవరం అదేవిధంగా సింగనమల నియోజకవర్గాల్లో ఏ మాత్రం ప్రభావం చూపించలేని వ్యక్తులను నాయకులుగా నిలబెట్టి టికెట్లు ఇచ్చినప్పుడు జగన్ ఇదే ధైర్యం, ఇదే 'నేను' అనే భావనను ప్రదర్శించారు."మొత్తంగా అసలు నాయకుల ప్రమేయం ఏమీ లేదు నేను చెప్పింది నేను చేసిందే శాసనం నన్ను చూసే గెలిపిస్తున్నారు" అనే వాదనను జగన్ ఎక్కువగా వినిపించారు. అయితే భయంకరమైన ఓటమి తర్వాత ఆయనలో కొంత రియలైజేషన్ కనిపించినట్టు తెలుస్తోంది. తాజాగా జరిగిన నాలుగు సమావేశాల్లో కూడా "మీరంతా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుంది. క్షేత్రస్థాయిలో మీరు చేసే ప్రచారంతోనే పార్టీ పుంజుకుంటుంది. పార్టీలో అందరూ కష్టపడాలి" అని జగన్ చెప్పుకొచ్చారు.నిజానికి 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు కూడా ఇలా చెప్పలేదు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించండి అని మాత్రమే గీతోపదేశం చేసిన జగన్.. ఇప్పుడు మాత్రం మీరు పని చేయండి మీరు ప్రజల్లోకి వెళ్ళండి మీరు బలంగా ఉండండి అని చెప్పడం ద్వారా తన వల్ల పార్టీ బలోపేతం కాలేదు కాబోదు అని ఒప్పుకున్నట్టే అయింది. దీనిని బట్టి భవిష్యత్తులో వైసిపి కార్యకర్తలకు నాయకులకు జగన్మోహన్ రెడ్డి ఫ్రీ హ్యాండ్ ఇవ్వడంతో పాటు వారికి గుర్తింపు ఇచ్చే దిశగా కూడా అడుగులు వేస్తున్నట్టుగా భావించాల్సి ఉంటుంది. మరి ఇది ఎంతవరకు నిలబడుతుంది.

# రేషన్ కార్డులపై కీలక అప్డేట్..! కొత్త పేర్ల నమోదు త్వరలోనే..!



హైదరాబాద్,తెలంగాణ లోని లక్షలాది కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదు. కొత్త రేషన్ కార్డులను రేపోమాపో జారీ చేస్తామన్న ప్రకటనలకే బీఆర్ఎస్ ప్రభుత్వం పరిమితమై పోయింది. పదేండ్ల పాటు ఇదే ప్రకటనలు. కానీ అర్హులైన లబ్దిదారులకు మాత్రం కొత్త రేషన్ కార్డులు జారీ చేయనేలేదు. కొత్త రేషన్ కార్డుల కోసం డిమాండ్లు వచ్చినప్పటికీ కేసీఆర్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరించింది.

కొత్త పేర్ల నమోదుకు కాంగ్రెస్ సర్కార్ సానుకూలం

ఇక మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి.. అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా ఎనిమిది నెలల పాటు కొత్త రేషన్ కార్డుల జారీపై కాలయాపన చేసింది. కానీ ఎట్టకేలకు కొత్త రేషన్ కార్డుల జారీకి కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇక భార్యాపిల్లల పేర్ల నమోదుకు త్వరలోనే అవకాశం కల్పించనున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. రేషన్ కార్డులో అర్హులైన కొత్త కుటుంబ సభ్యుల పేర్లను చేర్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని అధికారులు చెబుతున్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు ల అంశం కొలిక్కి రాగానే కొత్త పేర్ల నమోదుపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో అర్హులైన కుటుంబ సభ్యుల పేర్లను చేర్చే ప్రక్రియ మొదల వుతుందన్నారు. ఆ తర్వాత కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులను స్వీకరిస్తామని అధికారులు చెబుతున్నారు.

పెండింగ్‌లో 11.08 లక్షల దరఖాస్తులు

అర్హుల పేర్లు చేర్చాలని ఇప్పటికే మీసేవా కేంద్రాల ద్వారా 11.08 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో సివిల్ సప్లయిస్ అధికారులు ఇప్పటి వరకు ఆ దరఖాస్తులను పరిశీలించలేదు. త్వరలోనే ఈ దరఖాస్తులను పరిశీలించి, నెలకు ఎన్ని టన్నుల బియ్యం అదనంగా కావాల్సి ఉంటుందనే నిర్ధారించనున్నారు. అయితే దరఖాస్తుల ప్రకారం.. నెలకు ప్రభుత్వంపై రూ. 37.40 కోట్ల అదనపు భారం పడనున్నట్లు తెలుస్తోంది.

ఫ్యామిలీ డిజిటల్ కార్డులు వచ్చాకే..

మొదట ఫ్యామిలీ డిజిటల్ కార్డులు వచ్చాక.. ప్రస్తుత రేషన్ కార్డులు అందులోని లబ్దిదారుల సమాచారం అంతా చేరిపోయేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో రేషన్ షాపునకు వెళ్లి అక్కడ క్యూఆర్ కోడ స్కాన్ చేస్తే ఆ ఫ్యామిలీకి ఏ సరుకులకు, ఎంత పరిమాణానికి అర్హత ఉందన్న వివరాలు తెలిసిపోతాయి. ఆ మేరకు రేషన్ అందుకోవాల్సి ఉంటుంది.

కొత్తగా పెళ్లైన దంపతులు, వారి పిల్లల పేర్లు నమోదు చేసుకోవడం ఎలా..?

కొత్తగా పెళ్లైన దంపతులు కొత్త రేషన్ కార్డు ఎందుకు తీసుకోవాలి..? తల్లిదండ్రులకు సంబంధించిన రేషన్ కార్డులోనే కోడలి పేరు చేర్చితే సరిపోతుంది కదా అనే సందేహం రావొచ్చు. కానీ కాంగ్రెస్ సర్కాం ప్రతి ప్రభుత్వ పథకానికి రేషన్ కార్డును ప్రామాణికం చేసింది. అర్హులైన పేదలు ప్రభుత్వ పథకాలు పొందాలంటే రేషన్ కార్డును కలిగి ఉండాల్సిందే. కాబట్టి కొత్తగా పెళ్లైన దంపతులు, వారి పిల్లలు ఈ పద్ధతిని అనుసరించి కొత్త రేషన్ కార్డును పొందొచ్చు.

మరి కొత్త రేషన్ కార్డు పొందడం ఎలా..?

1. మొదటగా పెళ్లైన యువకుడు తన తల్లిదండ్రుల రేషన్ కార్డులో నుంచి తన పేరును తొలగించుకోవాలి. ఇందుకు మండల కేంద్రంలో ఉన్న తహసీల్దార్ ఆఫీసుకు వెళ్లాల్సి ఉంటుంది. తమ వెంట రేషన్ కార్డు తీసుకెళ్లాలి. తహసీల్దార్ ఆఫీసులో ఉండే కంప్యూటర్ ఆపరేటర్‌కు చెప్పి.. తల్లిదండ్రుల రేషన్ కార్డులో నుంచి పేరును తొలగించుకోవాలి.
2. ఆ తర్వాత తన భార్య పేరును కూడా వారి తల్లిదండ్రుల రేషన్ కార్డులో నుంచి తొలగించాలి. సదరు మహిళ ఏ మండల పరిధిలోకి వస్తే ఆ మండల కేంద్రంలో తహసీల్దార్ ఆఫీసులోనే ఈ ప్రక్రియను పూర్తి చేయించాలి.
3. ఇక అటు భర్త, ఇటు భార్య పేర్లు తమ తమ కుటుంబ సభ్యుల రేషన్ కార్డుల నుంచి తొలగించబడ్డాయో లేదో నిర్ధారించుకోవాలి. ఇద్దరి పేర్లు తొలగిపోయాయని నిర్ధారణ అయితే.. తహసీల్దార్ కార్యాలయాల వద్ద లభించే రేషన్ కార్డు దరఖాస్తులను తీసుకోని, వాటిని తప్పుల్లేకుండా నింపాలి.

కొత్త రేషన్ కార్డులకు ఏయే డాక్యుమెంట్స్ అవసరం..?

కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు నింపిన తర్వాత ఈ డాక్యుమెంట్స్ తప్పనిసరిగా ఆ దరఖాస్తుకు జతపరచాలి. అవి ఏంటంటే.. భార్యాభర్తల ఆధార్ కార్డులు, పుట్టిన తేదీ ధృవీకరణ కోసం స్టడీ సర్టిఫికెట్, తమ పేర్లు కలిగిన ఉన్న పాత రేషన్ కార్డులు, మ్యారేజ్ సర్టిఫికెట్ తో పాటు ఇద్దరి ఫొటోలను జతపరిచి, మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలి.అధికారులు తమ దరఖాస్తును పరిశీలించి, అన్ని సరిగ్గా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత తమకు కొత్త రేషన్ కార్డును జారీ చేస్తారు. అయితే జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న వారైతే.. తహసీల్దార్ కార్యాలయాలను కాకుండా జోనల్ సర్కిల్ ఆఫీసులను సంప్రదించి, తమ పేర్లను తొలగించుకోవాల్సి ఉంటుంది.

# మూసీ రాజకీయం.. బీఆర్ఎస్, బీజేపీ ప్లాన్ ఇదేనా?




హైదరాబాద్,గ్రేటర్ రాజకీయాల్ని మూసీ నది అంశం అట్టుడికిస్తుంది . లోక్‌సభ ఎన్నికల్లో ఖాతా తెరవలేకపోయిన బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తా చాటుకోవడానికి మూసీ అంశాన్ని ప్రధానాస్త్రంగా మార్చుకున్నట్లు కనిపిస్తుంది . మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సైతం అదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలకు దిగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మూసీ ప్రక్షాళన జరగాల్సిందే అని విపక్షాలకు సవాళ్లు విసురుతుండటం చర్చనీయాంశంగా మారింది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీకి కోలుకోలేని ఎదురు దెబ్బ తగిలింది. 39 స్థానాలకే పరిమితమైన బీఆర్ఎస్‌కు గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రమే ఊరట లభించింది. గ్రేటర్లో అధికార కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యమే లభించలేదు. బీజేపీ సైతం గోషామహల్ సీటుతోనే సరిపెట్టుకుంది. ఎంఐఎం గెలుపొందిన స్థానాలు మినహా అన్నీ బీఆర్ఎస్ సొంతం చేసుకుంది. తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యే అకాల మరణంతో కంటోన్మెంట్ సెగ్మెంటుకి జరిగిన బైపోల్స్‌లో కాంగ్రెస్ ఖాతా తెరిచి బీఆర్ఎస్ సిట్టింగు సీటుని గల్లంతు చేసింది. అప్పటికే ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ మంత్రి దానం నాగేందర్ కాంగ్రెస్ పంచకు చేరారు.గ్రేటర్‌లో మరికొందురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ని వీడడానికి రెడీగా ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ తాను పార్టీ మారలేదని బహిరంగ ప్రకటన చేసినా.. ఆయన పార్టీ మారిపోయారని గులాబీ నేతలే రచ్చ చేస్తున్నారు. ఇలాంటి గందరగోళ పరిస్థితుల మధ్య గ్రేటర్లో పార్టీ పట్టు నిలుపుకోవడం బీఆర్ఎస్‌కు ప్రతిష్టాత్మకంగా తయారైంది.. ఆ క్రమంలో జీహెచ్ఎంసీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో తమ ఉనికి కోసం పాకులాడుతున్న గులాబీ పెద్దలకు మూసీ, హైడ్రా అంశాలు అయాచిత వరాలుగా మారాయి.మూసి అంశాన్నే బేస్ చేసుకుని బీఆర్ఎస్ రాజకీయం చేయాలని చూస్తుంది. హైదరాబాద్ శ్రేయస్సు, భవిష్యత్తు అవసరాల కోసం మూసీ ప్రక్షాళన జరగాలని కాంగ్రెస్ సర్కారు పట్టుదలతో ఉంది. అయితే అది ప్రక్షాళన కాదు మూసీ సుందరీకరణ అంటూ, ప్రభుత్వ పెద్దలు రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసమే ఇదంతా చేస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుంది. అయితే మూసి రీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు అయింది బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే.. ఆ విషయాన్ని తెరమరుగు చేసే విధంగా మూసీ బాధితులకు అండగా నిలుస్తామంటూ గులాబీ నేతలు హడావుడి మొదలుపెట్టారు.ఇప్పటికే మూసీ పరివాహక ప్రాంతంలో బాధితుల పరామర్శ పేరుతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల వరకు మూసీ అంశాన్ని రగిలిస్తూనే ఉండాలని . మూసీ పరివాహక ప్రాంత నియోజకవర్గ ఎమ్మెల్యేలు రోజుకొకరు ఆ ప్రాంతాల్లో పర్యటించాలని బీఆర్ఎస్ ఆదేశాలు జారీ చేసింది. ఇదే అంశంపై గ్రేటర్ పరిధిలో భారీ బహిరంగసభ పెట్టేందుకు ప్లాన్ చేస్తుంది గులాబీ పార్టీ.మరోవైపు బీజేపీ కూడా మూసీ అంశంతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తుంది . ఈ నెల 23, 24న మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకంగా ఎంపీ, ఎమ్మెల్యేలతో మూసి పరివాహక ప్రాంతాలలో పర్యటిస్తామని, అలాగే 25 న పెద్ద ఎత్తున ధర్నా చేయబోతున్నట్లు బీజేపీ ప్రకటించింది. ఇప్పటికే మూసీ పరివాహక ప్రాంతాల్లో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ వంటి ముఖ్యనేతలందరూ పర్యటిస్తున్నారు.గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో రెండో స్థానాన్ని దక్కించుకున్న బీజేపీ.. ఈసారి మేయర్ పీఠం సాధించేలా పావులు కదుపుతుంది. అందులో భాగంగానే మూసీ అజెండాగా ప్రజల్లోకి వెళ్లుతూ.. మెజార్టీ స్థానాలను సాధించాలనే లక్ష్యంతో కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నట్లు కనిపిస్తుంది. మొత్తానికి గ్రేటర్ ఎన్నికల పుణ్యమా అని మూసీ వ్యవహారమే అన్ని పార్టీలకు పొలిటికల్ అజెండాగా మారిందిప్పుడు.

# సాగర్ పరిసరాల్లో పులి సంచారం

నాగార్జునసాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పులి సంచరిస్తునట్లు గుర్తించారు. నాగార్జున సాగర్ డ్యామ్ సమీపంలోని నాగులేటి రేంజ్ వద్ద ఈ పులి సంచరిస్తుంది. దీనిని అటవీ శాఖ సిబ్బంది వీడియోలో చిత్రీకరించింది. ఈ పులికి ఐదేళ్లు ఉంటాయని వారు తెలిపారు. గత వారం అటవీ శాఖ సిబ్బంది ఎప్పటిలాగా గస్తీ నిర్వహిస్తుంది. ఆ సమయంలో రహదారి పక్కనే ఉన్న పొదల్లో నుంచి పులి బయటకు వచ్చింది. కాసేపు పులి అక్కడే ఉండి.. అనంతరం మళ్లీ చెట్ల పొదల్లోకి వెళ్లిపోయింది.శివాలయం, వీఆర్ఎస్పీ ఆనకట్ట సమీపంలోని నాగులుటి రేంజ్ వరకు శాశ్వత నీటి వనరులు ఉన్నాయి. ఆయా ప్రాంతంలో జింకలు, మొసళ్లతో సహా వన్యప్రాణులు సమృద్ధిగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ వన్యప్రాణుల అధికారి ఈ సందర్భంగా ధృవీకరించారు. ఇది పులులకు ఆవాసమైన ప్రాంతమని తెలిపారు. ఈ ప్రాంతం మూడు పులులకు నిలయంగా మారింది. అందులో చిన్న మగ, రెండు ఆడ పులులున్నాయని అటవీ శాఖ అధికారి వివరించారు. ఇటీవలి సంతానోత్పత్తి కాలం అనంతరం ఈ ప్రాంతంలో ఆడ పులులు త్వరలో జన్మనిస్తాయని అధికారి పేర్కొన్నారు. మగ పులి సుమారు నెలన్నర పాటు ఆడ పులితో గడుపుతున్న దృశ్యాన్ని అటవీ అధికారులు ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్‌లో బంధించారు. అయితే నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో గతంలో అంటే.. 2018లో 68 పులులు ఉన్నాయి. కానీ తాజా లెక్కల ప్రకారం.. వాటి సంఖ్య 90 నుంచి 95కు పెరిగింది. 2025 నాటికి ఈ పులుల సంఖ్య 100 దాటుతుందని అధికారులు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.క బెంగాల్ టైగర్లు తమ భూభాగాన్ని గుర్తిస్తాయి. ఇవి సరిహద్దులను ఏర్పాటు చేయడానికి, ఆహారం, నీరు వనరులతోపాటు సహచరులను ఆకర్షించడానికి వీలు కల్పిస్తుంటాయి. 2-ఎసిటైల్-1-పైరోలిన్ (బాసుమతి బియ్యానికి ఉండే విలక్షణమైన సువాసనను అందించే సమ్మేళనం) అనే అణువు ఉండే మూత్రాన్ని స్ప్రే చేయడం ద్వారా పులులు తమ ఉనికిని మరియు ఆధిపత్యాన్ని ఆ ప్రాంతంలోని ఇతర పులులకు తెలియజేస్తాయి. సువాసన గుర్తుతో పాటు, పులులు తమ ప్రాదేశిక వాదాలను మరింత నొక్కి చెప్పడానికి చెట్లకు పంజా వేసి ఈ పులులు గర్జిస్తాయి. అనేక ముఖ్యమైన కారణాల వల్ల పులులు తమ భూభాగాన్ని గుర్తించుకుంటాయి. అడవిలో జీవించడంతోపాటు వృద్ధి చెందడానికి వాటికి ఇవి సహాయపడతాయి.

# హిందూదేవాలయాలపై దాడులు దుర్మార్గం

హైదరాబాద్,హిందూ దేవాలయాల మీద కొంతమంది దాడి చేస్తున్నారని.. దీనిపై ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు ఉపేక్షించడం సరికాదన్నారు. సోమవారం ఉదయం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు.. ముత్యాలమ్మ గుడిపై జరిగిన దాడి ఘటనపై ఫిర్యాదు చేశారు. అనంతరం నేతలు రాజ్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. ముత్యాలమ్మ గుడి మీద దాడి చేస్తే నిందితుడిని పిచ్చోడని ముద్ర వేసి వదిలేసే ప్రయత్నం చేశారని ఈటల మండిపడ్డారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా కొంతమంది చేస్తున్నారన్నారు.శాంతియుతంగా ర్యాలీ తీస్తుంటే పోలీసులు దుర్మార్గంగా లాఠీ ఛార్జ్ చేసి అరెస్టులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రదాడులకు నగరంలో ఎంతో మంది బలయ్యారన్నారు. మళ్లీ అలాంటి దాడులకే దుర్మార్గులు కుట్ర చేస్తున్నారని.. నిందితులను కఠినంగా శిక్షించాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి సూచించాలని గవర్నర్‌ను కోరామన్నారు. పోలీసులే మఫ్టీలో రెచ్చగొట్టి ర్యాలీలో దాడులు, లాఠీఛార్జ్ జరిగేలా చేశారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. హిందూ దేవాలయాల మీద దాడి జరిగితే సీఎం రేవంత్ ఇంత వరకు ఖండించలేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాం నిరంకుశ పాలన రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. హిందూ దేవాలయాల మీద దాడి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిందితుల మీద ప్రభుత్వం కేసు పెట్టకుండా ఏం చేస్తోందని ప్రశ్నించారు. వంద మంది నగరంలో దాడులకు కుట్ర చేసినట్లు తెలుస్తోందని.. రాష్ట్ర ఇంటిలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోందని నిలదీశారు. 'దేవాలయాల మీద దాడి మా తల్లి మీద దాడిలా భావిస్తాం... తిప్పికొడతాం' అని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. గవర్నర్‌ను కలిసిన అనంతరం బీజేపీ బృందం డీజీపీ ఆఫీసుకు బయలుదేరింది. గవర్నర్ కార్యాలయం నుంచి డీజీపీ ఆఫీస్‌కు ఒకే కారులో ఎంపీలు రఘునందన్ రావు, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర రెడ్డి, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు వెళ్లారు. ఈ సందర్భంగా నేతలున్న కారును ఎంపీ రఘునందన్ రావు స్వయంగా నడిపారు. కాసేపటికే డీజీపీ కార్యాలయానికి చేరుకున్న తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీల బృందం.. డీజీపీ జితేందర్‌ను కలిశారు. ముత్యాలమ్మ గుడి ఇష్యూ, హిందూ సంఘాల లాఠీఛార్జ్ అక్రమ కేసులపై ఫిర్యాదు చేశారు. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

# జమిలి ఎన్నికలు..

న్యూఢిల్లీ,దేశంలో వన్ నేషన్- వన్ ఎలక్షన్ ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే 2027లో భారత్‌లో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జమిలీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరింత సమాచారం కోసం ఈ స్టోరీ చదవండి.దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని గత కొంతకాలంగా బీజేపీ చెబుతోన్న సంగతి తెలిసిందే. ఇటీల కేంద్ర కేబినెట్ కూడా వన్ నేషన్- వన్ ఎలక్షన్ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ప్రకటించారు. వచ్చే శీతాకాలం పార్లమెంటులో కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టే ఛాన్స్ ఉందనే వార్తలు కూడా వచ్చాయి. అయితే దీనికి సంబంధించి తాజాగా మరో కీలక విషయం బయటపడింది. 2027లో భారత్‌లో మొత్తం ఒకేసారి ఫిబ్రవరిలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జమిలీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

5 ఆర్టికల్స్ సవరణ చేయాలి

జమిలీ ఎన్నికల సాధ్యాసాధ్యాలపై గతంలోనే మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ కూడా పూర్తిస్థాయిలో పరిశీలన జరిపింది. తాను రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి కూడా అందజేసింది. అయితే దేశవ్యాప్తంగా జమిలీ ఎన్నికలు జరగాలంటే రాజ్యాంగంలోని 5 ఆర్టికల్స్ సవరణ చేయాలని ఈ కమిటీ తెలిపింది. ఆర్టికల్ 83,85,172,174,356లను బిల్లు ద్వారా సవరణ చేయాలని సూచనలు చేసింది.

67 శాతం సభ్యుల మద్ధతు అవసరం

అయితే ఈ బిల్లు ఆమోదం పొందాలంటే కొన్ని పరిణామాలు జరగాల్సి ఉంటుంది. జమిలీ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ కావాలంటే.. లోక్‌సభ, రాజ్యసభలో 67 శాతం మంది సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలపాలి. అలాగే 14 రాష్ట్ర అసెంబ్లీలు సైతం మద్దతు ఇవ్వాలి. ఇలా జరిగితేనే ఈ బిల్లుకు ఆమోదం లభిస్తుంది. తద్వారా జమిలీ ఎన్నికలకు మార్గం సుగమమవుతుంది. ఒకవేల పార్లమెంటులో లేదా రాష్ట్రాల నుంచి మద్దతు దొరకకపోతే ఈ బిల్లు ఆమోదం సాధ్య కాదు.

2027 టార్గెట్

ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది శీతాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ బిల్లుకు పార్లమెంట్‌లో మద్దతు లభించినట్లైతే 2027లో ఉత్తరప్రదేశ్ ఎన్నికలతో పాటు దేశం మొత్తం ఒకేసారి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. అలాగే ఈ ఎన్నికలు జరిగిన 100 రోజుల తర్వాత మున్సిపల్, గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారు. దేశంలో పరిపాలన సౌలభ్యం కోసమే ఈ జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ ఘోషి తెలిపారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, హర్యానా, జమ్మూకశ్మీర్ తదితర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. వీటికి 2029 వరకు పాలించే హక్కు ఉంటుంది. అలాగే త్వరలో మహారాష్ట్ర, ఝార?ండ్, వచ్చే ఏడాది ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో తెలంగాణలో కూడా అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ రాష్ట్రాలు తమకు మిగిలి ఉన్న పాలనాకాలాన్ని రద్దు చేసుకొని జమిలీ ఎన్నికలకు మద్దతిస్తాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రాంతీయ పార్టీలకు నష్టం !

అయితే మెజార్టీ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది. దీనివల్ల జమిలీ ఎన్నికలు సాధ్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని పలువురు నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే 2027లో జమిలీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. మరోవైపు జమిలీ ఎన్నికలు నిర్వహిస్తే ప్రాంతీయ పార్టీ అస్థిత్వానికి దెబ్బపడుతుందని మరికొందరు అంటున్నారు. జమిలీ ఎన్నికల్లో రాష్ట్రాల సమస్యలు కాకుండా జాతీయ సమస్యలపైనే ఓటర్ల దృష్టి మళ్లుతుందని.. దీనివల్ల బీజేపీ పార్టీకే అనుకూలంగా ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నారు. మరీ జమిలీ ఎన్నికలు జరుగుతాయా ? లేదా ? అనేది తెలియాలంటే మరికొంత కాలం వేచిచూడాల్సిందే. వచ్చే శీతాకాల సమావేశంలో దీనిపై ఓ స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది.

# మరో బిగ్ టాస్క్ చేపట్టిన హైడ్రా.. నెక్స్ట్ టార్గెట్ వారే!



హైదరాబాద్,హైడ్రా మరో బిగ్ టాస్క్ చేపట్టింది. హైదరాబాద్ నగరంలో నాలాలు, ఫుట్ పాత్‌లపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. లక్డీకాపూల్, రాజ్‌భవన్ ప్రాంతాల్లో ఆయన పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. చెరువులు కబ్జా చేసిన వాళ్లకు వణుకు పుట్టించిన హైడ్రా.. మరో బిగ్ టాస్క్ చేపట్టింది. ఇక నుంచి నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే లక్డీకాపూల్, రాజ్‌భవన్ ప్రాంతాల్లో ఆయన పర్యటించి పలు నాలాలను పరిశీలించారు. ఓ డ్రైన్ పూర్తిగా కూడుకుపోయి ఉండగా.. మరో డ్రైన్‌లో చెత్తాచెదారం పేరుకుపోయి కనిపించింది. దీంతో చాన్నాళ్ల క్రితం నుంచి ఈ పరిస్థితే ఉందనే అంచనాకు వచ్చారు రంగనాథ్. నగరవ్యాప్తంగా వరద నీటి ప్రవాహ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఓ నివేదిక తయారు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. బాగా ట్రాఫిక్ జామ్ అవుతున్న ఏరియాల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణల పైనా రంగనాథ్ ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

సరైన వరద ప్రవాహ వ్యవస్థ లేకపోవడం..

ఈ మేరకు పది నిమిషాలు వర్షం పడితే మునగడం, రోడ్లన్నీ చెరువుల్లా మారుతున్న ప్రాంతాలపై హైడ్రా ఫోకస్ చేయనుంది. ఈ సమస్యలకు ప్రధాన కారణం సరైన వరద ప్రవాహ వ్యవస్థ లేకపోవడంతో పాటు నాలాలు, స్ట్రామ్ వాటర్ డ్రైన్లలో వ్యర్థాలు తొలగించకపోవడమేనని హైడ్రా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే నాలాలపై దృష్టి పెట్టారు. నాలాలపై ఉన్న ఆక్రమణను తొలగించి, కొత్త నిర్మాణాలను అడ్డుకోగలిగితే వరదల నుంచి హైదరాబాద్‌ని సేవ్ చేసినట్టేనని అధికారులు భావిస్తున్నారు.

1302 కిలోమీటర్ల మేర వరద..

గ్రేటర్‌లో 1302 కిలోమీటర్ల మేర వరద ప్రవాహ వ్యవస్థ ఉంది. వీటిల్లో వ్యర్థాలను తొలగించేందుకు ఏటా 50 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కానీ డ్రైన్‌ల దుస్థితి మాత్రం అలానే ఉంటుంది. ఈ నేపథ్యంలో అసలు పూడికతీత జరుగుతోందా..? లేదా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్నిచోట్ల డ్రైన్‌లు పూర్తిగా పాడైనా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇతర ప్రాంతాల్లోనూ మైనర్ డ్రైన్‌లు ఎలా ఉన్నాయన్నది పరిశీలించేందుకు హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు పూడికతీత పేరిట ఎంత ఖర్చు చేశారు..? ఎంత మేర వ్యర్థాలు తొలగించారు..? అన్నదీ పరిశీలించే అవకాశముంది. కాగా, గతంలో పూడిక తీయకుండానే తీసినట్టు చూపి బిల్లులు చెల్లించినట్టు గుర్తించారు. ఈ విషయంలో పలువురు ఇంజనీర్లు, కాంట్రాక్టర్లపై కేసులు నమోదైనప్పటికీ అధికారుల తీరు మారలేదు. అయితే ఇప్పుడు రంగనాథ్ ఎంట్రీతో పరిస్థితి మారే అవకాశం కనిపిస్తోంది.

# తెలంగాణ కాంగ్రెస్‌కు ట్రబుల్ షూటర్ దొరికారా?

హైదరాబాద్,పీసీసీ చీఫ్ అంటే.. పార్టీకే పరిమితం. కార్యకర్తలు, నేతల సమావేశం..పేరుకే అధ్యక్షుడు అన్నట్లుగా ఉండేది పరిస్థితి. కానీ మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యాక..పదవిని బాధ్యతగా ఫీల్ అవుతున్నారట. ప్రభుత్వ విషయాల్లో జోక్యం చేసుకోకుండా..పార్టీలో సీనియర్లను నొప్పించకుండా వ్యవహారాలను చక్కబెట్టే ప్రయత్నం చేస్తున్నారట.పీసీసీ చీఫ్‌గా మహేశ్ గౌడ్ చేసిన ఒక ప్రయత్నం.. ప్రతి వారం ఇద్దరు మంత్రులు గాంధీభవన్‌కు వచ్చేలా చేసింది. సామాన్య కార్యకర్తలు, కిందిస్థాయి నేతలు మంత్రులను కలవడానికి చాలా ఇబ్బంది పడేవారు. గాంధీభవన్‌కు మంత్రులు వస్తుండటంతో నేరుగా వారిని కలిసి సమస్యలు చెప్పుకుంటున్నారు. దీంతో పార్టీ క్యాడర్‌కు ప్రభుత్వం దగ్గరైందన్న ఫీలింగ్ కలుగుతుందంటున్నారు హస్తం నేతలు.

సమస్యల పరిష్కారంపై పీసీసీ చీఫ్ చొరవ

పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చొరవతో చాలామంది గాంధీభవన్ మెట్లెక్కి సమస్యలు చెప్పుకుంటున్నారు. పార్టీ ఆఫీస్‌కు వచ్చేవారి విషయంలో కూడా మహేశ్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ.. పరిష్కార మార్గం చూపిస్తున్నారు. జీవో 317తో ఇబ్బంది పడుతున్న ఉద్యోగుల అంశం విషయంలో పీసీసీ చీఫ్ చొరవ తీసుకొని మంత్రులను గాంధీభవన్‌కు పిలిచి చర్చలు జరిపేలా చేశారు.అక్టోబర్ 2న జీవో 317కు సంబంధించిన బాధిత ఉద్యోగులు గాంధీభవన్ ముట్టడికి వచ్చారు. కానీ వారిని లోపలికి పిలిచి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలతో చర్చలు జరిపించారు. ఉద్యోగుల ఇబ్బందులను కచ్చితంగా పరిష్కారం చూపుతామని సర్దిచెప్పారు.

జీవో 29 విషయంలోనూ చొరవ

లేటెస్ట్‌గా జీవో 29 విషయంలో గ్రూప్-1 అభ్యర్థులు పెద్దఎత్తున ఆందోళన చేశారు. కొందరు అభ్యర్థులు గాంధీభవన్ ముట్టడికి వస్తే వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ జోక్యం చేసుకొని వారిని వదలిపెట్టాలని పోలీసులకు సూచించడమే కాకుండా.. గాంధీభవన్‌కు పిలిచి గ్రూప్-1 అభ్యర్థుల సమస్యలు విన్నారు. ప్రభుత్వం



దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చి..మంత్రులను స్వయంగా కలిసి జీవో 29పై చర్చలు జరిపారు. ఒక బీసీ బిడ్డగా రిజర్వేషన్ల విషయంలో నష్టం జరిగితే ఊరుకోనని.. ఎలాంటి నష్టం జరగదని భరోసా ఇచ్చారు.ఇలా ఏ సమస్య వచ్చినా తన భుజాన వేసుకొని పరిష్కారం చూపుతున్నారు పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్. ప్రతిపక్షాల విమర్శలను కూడా తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్నారు. హైడ్రా, మూసీ వంటి విషయంలో పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి అండగా ఉంటూ విపక్షాలను ఎండగడుతున్నారు. పైగా ప్రభుత్వానికి..పార్టీకి మధ్య అనుసంధాన కర్తగా వ్యవహరిస్తూ..అన్ని తానై పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు.

## ములుగు జిల్లాలో పలు అభివృద్ధి పనులు

ములుగు,జిల్లాలో రాష్ట్ర మంత్రి సీతక్క విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత వెంకటాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (సీఎస్ఆర్ నిధులు, మౌరిటెక్ ఐటీ సంస్థ ఆధ్వర్యంలో) ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం గోవిందరావుపేట మండలం చల్వాయి నుంచి బుస్సాపూర్, లక్నవరం సరస్సు వరకు రూ.3.60 కోట్ల నిధులతో రహదారి పనులకు మంత్రి శంకుస్థాపన

# పవన్ కళ్యాణ్‌కు బిగ్ షాక్..

అమరావతి,ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు బిగ్ షాక్ తగలింది. తిరుపతి లడ్డూ వివాదంలో ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారని న్యాయవాది రామారావు పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో నవంబర్ 22న పవన్ కల్యాణ్‌ను వ్యక్తిగతంగా హాజరుకావాలని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు సమన్లు జారీ ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు బిగ్ షాక్ తగలింది. తిరుపతి లడ్డూ వివాదంలో ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారని న్యాయవాది రామారావు పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఏడాది జనవరిలో అయోధ్యకు పంపిన లడ్డూల్లో కల్తీ నెయ్యి వాడినట్లు పవన్ కల్యాన్ వ్యాఖ్యానించారని.. లడ్డూ తయారీలో జంతు కొవ్వు పదార్థాలు కలిసినట్లు ఆరోపణలు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. సెక్షన్ 91 ప్రకారం పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియా, వెబ్?సైట్లు, యూట్యూబ్ ఛానెళ్ల నుంచి తొలగించేలా సంబంధిత ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు.

పవన్ కల్యాణ్ రావాలి

ఈ నేపథ్యంలో సోమవారం ఈ పిటిషన్‌పై సిటీ సివిల్ కోర్టు విచారణ జరిపింది. నవంబర్ 22న పవన్ కల్యాణ్‌ను వ్యక్తిగతంగా హాజరుకావాలని సమన్లు జారీ చేసింది. అలాగే తెలంగాణ సీఎస్ శాంతికుమారి, ప్రిన్సిపల్ సెక్రటరీ హోమ్‌కు కూడా సమన్లు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 22కు వాయిదా వేసింది. అయితే పవన్ కల్యాణ్ కోర్టుకు వెళ్తారా ? లేదా ? అనే దానిపై ఆసక్తి నెలకొంది.

సంచలనంగా మారిన లడ్డూ వివాదం

ఇదిలాఉండగా.. ఇటీవల తిరుపతి లడ్డూ వివాదం దేశవ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే. లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతు కొవ్వు వాడినట్లు ఆరోపణలు వచ్చాయి. ల్యాబ్ రిపోర్టులో కూడా నెయ్యిలో కల్తీ జరిగినట్లు తేలింది. ఈ కల్తీ నెయ్యిలో జంతు కొవ్వు కలిపే అవ కాశాలు



న్నాయని చెప్పింది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై పవన్ కల్యాణ్ సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు. లడ్డూలో జంతు కొవ్వు కలిపి భక్తుల మనోభావాలు దెబ్బతీశారంటూ తిరుపతి వేదికగా నిర్వహించిన సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో కూడా విచారణ జరిగింది. లడ్డూ విషయంలో నిజ నిజాలు తెలుసుకోకుండా సీఎం చంద్రబాబు ఎలా ప్రకటన చేస్తారంటూ న్యాయస్థానం సీరియస్ అయ్యింది. ఒక ల్యాబ్ రిపోర్టు వచ్చినప్పుడు రెండోసారి ఒపినియన్ తీసుకున్నారా అని ప్రశ్నించింది. కనీసం దేవుడినైనా రాజకీయాలకు దూరంగా ఉంచాలంటూ హితువు పలికింది. తిరుమల లడ్డూ వ్యవహారంలో నిజానిజాలు తెలుసుకోకుండా సీఎం చేసిన ప్రకటనపై సుప్రీంకోర్టు సీరియస్ అయ్యింది. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారో లేదో తెలుసుకోకుండా ప్రకటన ఎలా చేస్తారంటూ ప్రశ్నించింది. కనీసం దేవుడినైనా రాజకీయాలకు దూరంగా ఉంచాలంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కల్తీ జరిగినట్లు చెబుతున్న నెయ్యి ట్యాంకర్‌కు పర్మిషన్ ఇవ్వలేదని టీటీడీ చెబుతుంటే.. సీఎం ప్రకటన ఎందుకు భిన్నంగా ఉందని సుప్రీంకోర్టు నిలదీసింది. కల్తీ విషయంలో క్లారిటీ లేకుండా సీఎం ఎలా ప్రకటన చేస్తారంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

# మోడీ విధానాలే కాంగ్రెస్‌కు రక్ష



న్యూఢిల్లీ, మోడీ తీసుకున్న కాంగ్రెస్ ముక్త భారత్ నినాదాం పేలవంగా మారింది. ప్రజలు మోడీ పిలుపునకు పెద్దగా స్పందించడం లేదు. అందుకే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించారు. కేవలం మోడీ హామీలు నినాదాలుగా మారుతున్నాయి. విధానాలు అటకెక్కుతున్నాయి. బిజెపి కన్నా కాంగ్రెస్ మేలన్న వాదన మెల్లగా బలోపేతం అవుతోంది. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా బిజెపి గెలిచింది. దీంతో ఎన్‌డిఎ మిత్రపక్షాల అండతో మోడీ గద్దెనెక్కారు. ఇప్పటికీ మోడీ తన విధానాలు మార్చుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీలు తేడా వస్తే మోడీని గద్దె దింపడానికి వెనకాడరు. మరోవైపు ప్రాంతీయ పార్టీలకు దర్యాప్తు సంస్థల పనితీరు దేశంలో జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. జార్ఖండ్, ఢిల్లీ ముఖ్యమంత్రులకు ఇడి వేధింపులు ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఈ రెండు రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను తుదముట్టించడం కోసం బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. నిజానికి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడంలో బీజేపీకి సహాయపడ్డారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించగలిగారు. ఓ రకంగా కాంగ్రెస్ ముక్త నినాదానికి ప్రయత్నించారు. ఇలా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఉనికిలేకుండా చేయగలిగారు.తన సంక్షేమ ఎజెండాయే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలు అనుకరించేలా చేయగలిగారు. కాంగ్రెస్ బలహీనపడుతున్న కొద్దీ ఆప్ బలపడింది. అయినప్పటికీ మోదీ సకల ఆయుధాలు కేజ్రీవాల్‌పై ప్రయోగించడంతో ఆయన తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. ఆప్ జీవన్మరణ సమస్యలో ఉంది. ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేందుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్లగొట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం. లేదా ప్రాంతీయ పార్టీలె కాంగ్రెస్ గొడుగు కింద బలంగా మారుతాయి. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యం సాధించడం కష్టమని గ్రహించినందువల్లే మోదీ ప్రాంతీయ పార్టీలను లక్ష్యంగా పెట్టుకున్నారా? అన్న అనుమానాలకు ఆస్కారం లేకపోలేదు. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసుకుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచివేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. లోక్‌సభ ఎన్నికలకోసం మోదీ అవినీతి అంశాలన్ని ఒక ప్రయోగంగా ఉపయోగించుకుంటున్నారా అన్నది చర్చనీయాంశమవుతోంది. 2014లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకున్న దశలో నరేంద్రమోదీ ఈ దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయాలని పిలుపు ఇచ్చారు. కాని 9 సంవత్సరాల పాలన తర్వాత కూడా ఆయన దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయలేకపోయారు. కర్ణాటకలో బీజేపీ ఘోరపరాజయం చెందిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి అవకాశం లేకుండా పోతున్నది. ఇదంతా స్వయంకృతమని తెలంగాణ నిరూపించింది. కర్ణాటకతో పాటు హిమాచల్‌లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. తరవాత తెలంగాణలోనూ కాంగ్రెస్ పాగా వేసింది. ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, జనసేన కారణంగా బిజెపి నిలదొక్కుకో గలిగింది. సొంతంగా ఇప్పుడు పోటీ చేసినా ఆ పార్టీకి ఒక్కసీటు కూడా రాదు. కర్ణాటకలో అంతరించిపోయే స్థితిలో జనతాదళ్ (ఎస్) బీజేపీతో చేతులు కలిపింది. నిజానికి కాంగ్రెస్ పార్టీ కంటే మోదీ ప్రాంతీయ పార్టీలను అణిచివేయడంపైనే అధికదృష్టి సారిస్తున్నారేమోనని ఒకరకంగా అనిపిస్తోంది. ఈడీ, సీబీఐలను ప్రయోగించి మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, శివసేనలను బీజేపీ చీల్చగలిగింది. పంజాబ్‌లో అకాలీదళ్‌ను దెబ్బతీసింది. బిహార్‌లో లోక్ జనశక్తిని ముక్కలు చేసింది. నితీశ్ కుమార్‌కు పొమ్మనకుండా పొగపెట్టి పంపించింది. తరవాత మళ్లీ దారికి తెచ్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బీఎస్పీని బీజేపీ నిర్వీర్యం చేసింది. సమాజ్‌వాది పార్టీని అస్తిత్వం కోసం పోరాడే పరిస్థితిని కల్పించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ తర్వాత బీజేడీ భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నార్థకమైంది. తాజాగా జార్ఖండ్‌లో కూడా హేమంత్ సోరెన్‌ను వెంటాడుతోంది. దేశంలో అనేక చిన్నా చితక, ఉప ప్రాంతీయ పార్టీలు మోదీ భయంతో బీజేపీతో చేతులు కలపక తప్పడం లేదు. అయితే ప్రజల ఆకాంక్షలకోసం ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయో అవి ఆ ఆకాంక్షలను విస్మరించి అధికారాన్ని కొద్ది మంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతం అయ్యేలా చూశాయి. అరాచక పాలనతో పాటు, విపరీత అవినీతికి పాల్పడ్డాయి. ఇవాళ ప్రజలు కాంగ్రెస్ వైపో, బీజేపీ వైపో మళ్లుతున్నారంటే అందుకు ప్రధాన కారణం ప్రాంతీయ పార్టీల నేతల స్వయం కృతాపరాధాలే అని చెప్పుకోవాల్సిందే. ఈ క్రమంలో బిజెపి తన విధానాలు మార్చుకుంటే తప్ప మరింతగా నిలబడలేదు. ప్రజల్లో ఆందరణ పొందలేదు.

# ఊహించని రాజకీయ పరిణామం..



అమరావతి,జగన్, షర్మిలకు మధ్య గత కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తన ఆస్తిలో షర్మిలకు ఏమీ ఇచ్చేది లేదని అనుకున్న జగన్.. ఇప్పుడు ఆస్తి పంపకాలకు ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. బెంగళూరులో దీనిపై చర్చలు జరిగినట్లు సమాచారం.ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమతమైన వైసీపీకి కోలుకోలేని దెబ్బ పడింది. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రెండోసారి కూడా అధికారం తమదే అనే ఓవర్‌కాన్ఫిడెన్స్‌తో ఉన్న జగన్.. అధికారం పోయిన తర్వాత వాస్తవాలను తెలుసుకనే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో సోదరి షర్మిలతో వివాదం మంచిదికాదని... ఎన్నికలకు ముందు జగన్‌కు సన్నిహితులు చెప్పారు. కానీ జగన్ మాత్రం వీరిని పట్టించుకోలేదు. అయితే ఎన్నికల తర్వాత జగన్ తన వైఖరిని మార్చుకుంటున్నట్లు సమాచారం.

ఆస్తి పంపకాలకు ఓకే

జగన్‌కు, షర్మిలకు మధ్య గత కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తన ఆస్తిలో షర్మిలకు ఏమీ ఇచ్చేది లేదని అనుకున్న జగన్.. ఇప్పుడు ఆస్తి పంపకాలకు ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. బెంగళూరులోనే వీటికి సంబంధించిన చర్చలు జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం ఒంటరిగా ఉంటే రాజకీయ భవిష్యత్తు ఉండదని భావిస్తున్న జగన్.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌ను కలుపుకొని పోయే యోచనలో ఉన్నారనే ప్రచారాలు జరుగుతున్నాయి.

ఒంటరిగా కష్టమే

ప్రస్తుతం ఏపీసీసీ చీఫ్‌గా షర్మిల కొనసాగుతున్న సంగతి తెలిసిందే. గత కొంతకాలంగా జగన్‌ను షర్మిల వ్యతిరేకిస్తునే ఉంది. వారిద్దరి మధ్య ఆస్తి పంపకాలు వివాదమే దీనికి కారణమనే ప్రచారం జరుగుతోంది. కానీ ఇప్పుడు ఆస్తి పంపకాలకు జగన్ ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వైసీపీతో జతకట్టేందుకు షర్మిల వ్యతిరేకించపోవచ్చని తెలుస్తోంది. ఏపీలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను చూసుకుంటే కాంగ్రెస్, వైసీపీ ఒంటరిగా రాజకీయంగా పుంజుకోవడం కష్టమని పలువురు విశ్లేషకులు సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌తో కలిస్తే తమకు రాజకీయ భవిష్యత్తు ఉంటుందని వైసీపీ భావిస్తుండగా.. మరోవైపు వైసీపీతో కలిస్తే ఏపీలో తమ పార్టీ బలపడేందుకు అవకాశం దొరుకుతుందని కాంగ్రెస్ భావిస్తున్నట్లు సమాచారం. అయితే కాంగ్రెస్‌తో కలవాలంటే షర్మిలతో ఉన్న వివాదాన్ని తెగదెంపులు చేసుకోవాలని అధిష్ఠానం పెద్దలు చెప్పడంతోనే జగన్ ఆస్తుల పంపకంపై సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో జగన్ బెంగళూరుకు ఎక్కువగా వెళ్తున్నారు. షర్మిలతో వివాదాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకే ఆయన అక్కడ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. రెండు అంశాల్లో తప్పా ఆస్తుల అంశాల్లో ఇద్దరి మధ్య రాజీ కుదిరినట్లు సమాచారం. కర్ణాటక డిప్యూటీ సీఎం డేకే శివకుమార్ అన్నాచెల్లె మధ్య రాజీ కుదిర్చినట్లు ప్రచారం జరుగుతోంది.ఆర్థికపరమైన వివాదాలకు ముగింపు పలకాలని జగన్, షర్మిల ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం టీడీపీ,జనసేన ఎన్డీయే కూటమిలో ఉన్న సంగతి తెలిసిందే. గతంలో జగన్ ఇండియా కూటమి వైపు వెళ్తారనే ప్రచారం కూడా జరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో విపక్ష జాతీయ పార్టీతో జట్టు కడితేనే రాష్ట్రంలో రాజకీయంగా బలపడవచ్చని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు 2027లో జమిలీ ఎన్నికలు కూడా జరిగే అవకాశాలు ఉన్నట్లు పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే వైసీపీ, కాంగ్రెస్ కలిసి ఎన్నికల బరిలోకి దిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరి త్వరలో ఏపీలో ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయో తెలియాలంటే మరికొంత కాలం వేచిచూడాల్సిందే.

## గడ్చిరోలి జిల్లాలో ఎన్‌కౌంటర్

నాగపూర్, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో సోమవారంనాడు ఎన్‌కౌంటర్ చోటుసుకుంది. పోలీసులకు, నక్సలైట్లకు మధ్య జరిగిన కాల్పుల్లో నలుగు నక్సలైట్లు హతమయ్యారు. ఒక పోలీసు గాయపడ్డాడు. భమ్రాగఢ్ తహసిల్‌లోని కొప్రి అడవుల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు అధికారులు తెలిపారు. గడ్చిరోలి పోలీస్ సీ60 కమెండో టీమ్, సీఆర్‌పీఎఫ్ బృందం సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. కొప్రి అడవుల్లో నక్సలైట్లు సంచరిస్తున్నట్టు పోలీసులకు ఇంటెలిజెన్స్ సమాచారం రావడంతో సుమారు 60 మంది పోలీసు బలగాలు ఈ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాయి.

# 24న కేంద్ర హూంశాఖ కీలక భేటీ..

హైదరాబాద్, విభజన అనంతరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య విభజన సమస్యల పరిష్కారానికి మరో కీలక అడుగు పడింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విభజన జరిగి పదేళ్లయినప్పటికీ, ఇంకా అనేక అంశాలు ఓ కొలిక్కి రావాల్సి ఉంది. ఈ అపరిష్కృత అంశాలపై కేంద్ర హూంశాఖ చొరవ తీసుకుని సమావేశాలు ఏర్పాటు చేస్తోంది.

ఈ క్రమంలో ఈ నెల 24న కేంద్ర హూంశాఖ ఆధ్వర్యంలో కీలక సమావేశం జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ భేటీలో ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొననున్నారు. ఇరు రాష్ట్రాలకు చెందిన వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొనే ఈ సమావేశానికి హాజరుకావాలని తెలంగాణ సీఎస్‌కు కేంద్ర హూంశాఖ సమాచారమిచ్చింది.ఈ సమావేశంలో పలు కేంద్ర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు.. విద్యుత్, రహదారులు, ఉక్కు, వ్యవసాయం తదితర శాఖల కార్యదర్శులు కూడా పాల్గొంటారు. ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ప్రధాని మోదీ, కేంద్ర హూంశాఖ మంత్రి



అమిత్ షాలను కలిసి విభజన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ క్రమంలోనే కేంద్ర హూంశాఖ తాజాగా సమావేశం ఏర్పాటు చేసింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com